సూర్య www.suryaa.com
18 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

visit us @ http://epaper.suryaa.com
సంపుటి 18 | సంచిక 352
మంగళవారం | 14 అక్టోబర్ 2025 | విజయవాడ
| పేజీలు 8+8 | వెల: రూ. 8.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - వర్ష ఋతువు, ఆశ్వయుజ మాసం బహుళ పక్షం అష్టమి సా.4.05 వరకు, పునర్వసు సా.5.28 వరకు, వర్జ్యం ఉ.5.59 నుంచి 7.30 వరకు
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.15 నుంచి 9.03 వరకు తిరిగి రా.10.35 నుంచి 11.24 వరకు

## రాజధాని అభివృద్ధి
# యాత్ర ప్రారంభం

● రైతుల ఇబ్బందులు పోగొట్టి రెట్టింపు గౌరవం వచ్చేలా చేస్తాం ● రాజధాని ఏర్పాటుకు దారి చూపింది అమరావతి రైతులే ● సీఆర్డీఏ భవనాన్ని ప్రారంభించిన సీఎం ● రైతు సమస్యల పరిష్కార బాధ్యతను పెమ్మసాని, నారాయణ, శ్రావణ్ కుమార్‌లకు అప్పజెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



రాజధాని అభివృద్ధి యాత్ర ఆరంభమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జీ7 విధానంలో నిర్మించిన సీఆర్డీఏ భవనాన్ని సోమవారం ఉదయం 9.55 గంటలకు సీఎం చంద్రబాబు రాజధానికి భూములు ఇచ్చిన రైతులతో కలిసి ప్రారంభించారు. సీఆర్డీయే, ఏడీసీఎల్‌తో పాటు మున్సిపల్ శాఖకు సంబంధించిన అన్ని విభాగాలు ఒకే చోట నుంచి కార్యకలాపాలు నిర్వహించేలా ప్రభుత్వం భవన నిర్మాణాలు చేపట్టింది.

వివరాలు-2లో

## సంక్షేమ హాస్టళ్ల అత్యవసర
# ఖర్చులకు రూ.60 కోట్లు

● భోజనం, జీతాలు, మౌలిక సదుపాయాలమరమ్మతులకు కేటాయింపు ● విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నైజేషన్ ● వైద్య కళాశాలలతో హాస్టళ్ల అనుసంధానం ● అటు విద్యార్థులకూ వైద్య పరీక్షలు కూడా ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశాలు... ● సంక్షేమ వసతి గృహాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ● వైద్య సేవలు, విద్యా సాంకేతికత, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు



2 లో

బీసీ, ఎస్సీ , ఎస్టీ , మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు , తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు.


## నష్టాల్లో స్టాక్ మార్కెట్



5 లో

● చైనా ఉత్పత్తులపై అదనంగా 100 శాతం సుంకాలు ● రూపాయి మారకం విలువ డాలరుతో పోలిస్తే 88.66 ● సెన్సెక్స్ 173 పాయింట్ల మేర పడిపోగా.. నిఫ్టీ 58 పాయింట్లు క్షీణత

## ట్రంప్‌కు ఇజ్రాయెల్ అత్యున్నత పౌర పురస్కారం



6 లో

● అమెరికా అధ్యక్షుడికి 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఆనర్' ● ప్రదానం చేయనున్నట్లు ప్రకటించిన ఇజ్రాయెల్ అధ్యక్షుడు

## కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ



6 లో


● జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు ● టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రచార ర్యాలీలో తొక్కిసలాట - ఘటనలో 41 మంది మృతి ● అన్ని పార్టీల ఆందోళనలను తొలగించడానికి సమగ్ర దర్యాప్తు

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## పూరణ్ కుమార్
# ఆత్మహత్య దారుణం

● నిందితులపై చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది ● ప్రధాని, హోంమంత్రి రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలి ● ఈ సంఘటన మానవ హక్కుల ఉల్లంఘన ● చండీగఢ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



2 లో

## విశాఖ సీఐఐ సమ్మిట్‌కు
# ప్రధానికి ఆహ్వానం



వివరాలు-6లో

● మోదీని కలిసిన సీఎం చంద్రబాబు ● సీఎం వెంట కేంద్రమంత్రులు రామ్మోహన్, పెమ్మసాని, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ● విశాఖ పెట్టుబడుల సదస్సు సన్నాహకాలను సమీక్షించిన సీఎం

## గ్రామ సచివాలయ సిబ్బంది
# పదోన్నతులు షురూ

● అధ్యయనానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీ ● ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పదోన్నతులపై కసరత్తు ప్రారంభించింది. పదోన్నతుల కల్పనపై అధ్యయనానికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసింది.



2 లో



3 లో

## మంథని నియోజకవర్గం
# అభివృద్దే నా ధ్యేయం

● ఎవరెన్ని విమర్శలు చేసినా పట్టించుకోను ● మంత్రి శ్రీధర్ బాబు


## అంతా ఇంతే!




ఫోన్‌పే, ఆన్‌లైన్‌లో తీసుకుంటారేమో సార్!

## పోలీస్ శాఖ మూసేయండి

● ఆదేశాలు పాటించలేదంటూ హైకోర్టు ఆగ్రహం ● రికార్డులు స్వాధీనం చేయడంలో పోలీస్ శాఖ విఫలం ● పోలీస్ శాఖ ఇలాగేనే పని చేసేదని ప్రశ్నించింది ● తప్పు చేసిన వారికి పోలీసులు సహకరించారు




వివరాలు-2లో

ఏపీ పోలీస్ శాఖపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ శాఖను మూసివేయడం మేలని హైకోర్టు అభిప్రాయ పడింది. రాష్ట్రంలో పోలీసు శాఖ నిద్రపోతోందని.. పోలీసు వ్యవస్థ పనిచేసేది ఇలాగేనా అని ప్రశ్నించింది.

## 16న కర్నూలుకు
## ప్రధాని మోడీ రాక..

● 'సూపర్ జీఎస్టీ మాపర్ సేవింగ్స్'పై భారీ బహిరంగ సభ ● హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్



ఈనెల 16వ తేదీన కర్నూల్ జిల్లాకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ రామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 'సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్" భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు.

వివరాలు-3లో

## 18న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను
# విజయవంతం చేయండి




2 లో

● రాష్ట్ర బందుతో రిజర్వేషన్ వ్యతిరేకుల కళ్ళు తెరిపిస్తా ● బంద్‌కు అఖిలపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాలి ● బంద్‌లో పార్టీలకతీతంగా బీసీ శ్రేణులు పాల్గొని బీసీల సత్తా చాటాలి ● బంద్ వాల్ పోస్టర్ ఆవిష్కరణలో ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి


బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 18న జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్ లో పార్టీలకతీతంగా సమస్త బీసీ శ్రేణులు పాల్గొని బీసీల ఐక్యతను చాటాలని బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

## క్రీడలకు కూటమి ప్రభుత్వం
# ప్రాధాన్యతనిస్తుంది



2 లో


● అఖిల భారత పోలీస్ పవర్ లిఫ్టింగ్ క్లస్టర్ పోటీలను ప్రారంభించిన హోం మంత్రి అనిత ● పోలీసుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే పోటీలు ● పవర్ లిఫ్టింగ్‌తో పాటు, యోగా పోటీలను నిర్వహించటం చాలా సంతోషంగా ఉంది ● హోం మంత్రి అనిత



"మీరు ఎప్పుడైనా కోరుకున్నదంతా భయం యొక్క మరోక వైపు ఉంది."
- జార్జ్ అడైర్



"మీరు ఒక్కసారి మాత్రమే జీవిస్తారు, కానీ మీరు దానిని సరిగ్గా చేస్తే, ఒకసారి సరిపోతుంది."
- మే వెస్ట్



"గొప్ప పని చేయడానికి ఏకైక మార్గం మీరు చేసే పనిని ప్రేమించడం."
- స్టీవ్ జాబ్స్

# రాజధాని అభివృద్ధి యాత్ర ప్రారంభం

- రైతుల ఇబ్బందులు పోగొట్టి రెట్టింపు గౌరవం వచ్చేలా చేస్తాం
- రాజధాని ఏర్పాటుకు దారి చూపింది అమరావతి రైతులే
- సీఆర్డీఏ భవనాన్ని ప్రారంభించిన సీఎం
- రైతు సమస్యల పరిష్కార బాధ్యతను పెమ్మసాని, నారాయణ, శ్రావణ్ కుమార్‌లకు అప్పజెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజధాని అభివృద్ధి యాత్ర ఆరంభమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జీ౦7 విధానంలో నిర్మించిన సీఆర్డీఏ భవనాన్ని సోమవారం ఉదయం 9.55 గంటలకు సీఎం చంద్రబాబు రాజధానికి భూములు ఇచ్చిన రైతులతో కలిసి ప్రారంభించారు. సీఆర్డీయే, ఏడీసీఎల్‌తో పాటు మున్సిపల్ శాఖకు సంబంధించిన అన్ని విభాగాలు ఒకే చోట నుంచి కార్యకలాపాలు నిర్వహించేలా ప్రభుత్వం భవన నిర్మాణాలు చేపట్టింది. ఈ కార్యాలయంలో ప్రారంభం అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారు. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టింది. రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని అమరావతిలో ఏర్పాటు చేశాం. రాజధాని నిర్మాణానికి భూమి కావాలి... ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించాం. భూమి కోసం ఎదురుచూస్తున్న సమయంలో అమరావతి రైతులు నాకు దారి చూపారు. రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చాం. సమీకరణ విధానాన్ని విజయవంతం చేసిన చరిత్ర అమరావతి రైతులదే. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు...మనమే ఈ విధానాన్ని తెచ్చాం... సక్సెస్ చేశాం. అమరావతి పనుల రీ-స్టార్ట్ తర్వాత మొదటిగా సీఆర్డీఏ బిల్డింగ్ ప్రారంభమైంది.. నాకు సంతోషంగా ఉంది. సీఆర్డీఏ భవన ప్రారంభం రాజధాని అభివృద్ధి యాత్రకు ఆరంభం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**రాజధాని పోరాటంలో జోలె పట్టాను**

"రాజధాని కోసం అమరావతి మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు...గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారు. రైతుల ఉద్యమానికి మద్ధతుగా నేను కూడా జోలె పట్టాను...ఉద్యమానికి అండగా నిలిచాను. కష్టాలు మరిచిపోవద్దు... రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలి.. నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఫేజ్-1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారు. భూములిచ్చినందుకు గత పాలకులు మిమ్మల్ని నానా హింసలు పెట్టారు. రాజధాని ఎడారి అన్నారు... వేశ్యల రాజధాని అన్నారు. ఎంతో అపహాస్యం చేశారు. రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా... రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తాం. అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడదంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు అవసరం. అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుంది. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రార%శీ%భం కావాలి. అమరావతి అభివృద్ధికి ఆటంకాలు లేవు. అమరావతిని క్వాంటం వ్యాలీ చేస్తున్నాం... విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. ఒకప్పుడు ఐటీ.. ఇప్పుడు క్వాంటం, డేటా సెంటర్, ఏఐ వంటి టెక్నో రంగాలదే హవా. అమరావతి రైతుల అభివృద్ధికి అండగా ఉంటాం... చేయూతనిస్తాం. రాజధాని అమరావతి పునాదులు చాలా బలంగా ఉన్నాయి. దేశంలోని పవిత్ర దేవాలయాలు, మసీదులు, చర్చీల నుంచి మట్టి, జలాలు తెచ్చి శంకుస్థాపన చేశాం. రాజధాని అభివృద్ధి కోసం ప్రతి రోజూ వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తాను. అమరావతి రైతులను మరిచేదే లేదు. త్వరలో భూములిచ్చిన రైతులతో ప్రత్యేకంగా సమావేశం అవుతా. అందరం కలిసి రాజధానిని అభివృద్ధి చేసుకుందాం." అని సీఎం చెప్పారు.



**రాజధాని రైతుల సమస్యల పరిష్కార బాధ్యత ఆ ముగ్గురిదే**

"రాజధాని రైతులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూస్తాం. రైతులకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తాం. రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించే బాధ్యతను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తీసుకోవాలి. రైతులతో నిరంతరం మాట్లాడి వారి సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యతను ఈ ముగ్గురు తీసుకుంటారు. అప్పటికీ ఇంకా పరిష్కారం కాని సమస్యలేమైనా ఉంటే నేను బాధ్యత తీసుకుంటాను. హైటెక్ సిటీ నిర్మాణం మొదలు పెట్టే నాటికి అక్కడ ఎకరం రూ.లక్ష ఉండేది...ఇప్పుడు రూ.177 కోట్లకు చేరింది. అమరావతి ప్రాజెక్టు సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో నిర్మిస్తున్నాం... విమర్శలు చేసే వారంతా ఈ విషయాన్ని గమనించాలి. ఒకసారి జరిగిన తప్పుకు రైతులతో పాటు రాష్ట్రం ఎంత నష్టపోయిందో అందరికీ తెలుసు. మళ్లీ అలాంటి తప్పులు జరగకూడదు. కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి. పవన్ కళ్యాణ్, బీజేపీలతో కలిసి ముందుకెళ్తున్నాం. విశాఖ కూడా అద్భుతంగా అభివృద్ధి అవుతోంది. దేశానికి వచ్చిన అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు వస్తోంది. నా ఆలోచన ఎప్పుడూ ప్రజల కోసమే... వారి భవిష్యత్ కోసమే' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, ధూళిపాళ నరేంద్ర, కొలికపూడి శ్రీనివాసరావు, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ మూసేయండి

- ఆదేశాలు పాటించలేదంటూ హైకోర్టు ఆగ్రహం
- రికార్డులు స్వాధీనం చేయడంలో పోలీస్ శాఖ విఫలం
- తప్పు చేసిన వారికి పోలీసులు సహకరించారు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ పోలీస్ శాఖపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ శాఖను మూసివేయడం మేలని హైకోర్టు అభిప్రాయ పడింది. రాష్ట్రంలో పోలీసు శాఖ నిద్రపోతోందని.. పోలీసు వ్యవస్థ పనిచేసేది ఇలాగేనా అని ప్రశ్నించింది. తిరుపతి పరకామణి కేసు విచారణ సందర్భంగా పోలీసు శాఖ పనితీరుపై నిప్పులు చెరిగింది. రికార్డులు సీజ్ చేయమని సెప్టెంబర్ 19వ తేదీన ఉత్తర్వులు ఇచ్చినా ఇంత వరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించింది. సీఐడీలో ఐజీ పోస్టు లేదనే కారణంతో ఆదేశాలు అమలు చేయరా..? అని నిలదీసింది. నిబద్ధత ఉంటే ఐజీ స్థాయి అధికారిని నియమించి రికార్డులు సీజ్ చేయాలని, డీజీపీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసి ఉండేవారని అన్నారు. ఈ కేసు దర్యాప్తులో కీలకమైన రికార్డులను సీజ్ చేయడంలో డీజీపీ విఫలం అయ్యారని ఫైర్ అయింది. ఆ ఆధారాలను తారుమారు చేసేందుకు వీలుగా తప్పు చేసిన వారికి పోలీసులు సహకరించారని ఆరోపించింది. పోలీసు శాఖ చర్యలే ఈ కేసులో ఎంత నిజాయితీగా వ్యవహరించాయో చెబుతున్నాయని ఎద్దేవా చేసింది. రికార్డులు సీజ్ చేసి హైకోర్టు ముందు ఉంచాలని సీఐడీ డీజీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణ అక్టోబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. పరకామణిలో అక్రమాలపై ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది ఏపీ హైకోర్టు.



# సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు

- భోజనం, జీతాలు, మౌళిక సదుపాయాలమరమ్మతులకు కేటాయింపు
- విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నైజేషన్
- వైద్య కళాశాలలతో హాస్టళ్ల అనుసంధానం
- అటు విద్యార్థులకూ వైద్య పరీక్షలు కూడా ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశాలు...
- సంక్షేమ వసతి గృహాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- వైద్య సేవలు, విద్యా సాంకేతికత, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : హైదరాబాద్: బీసీ, ఎస్సీ , ఎస్టీ , మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు , తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన , బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా... జవాబుదారీతనం ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు. విద్యార్థులకు విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని... దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఆదేశించారు.

హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ వైద్య కళాశాలలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు , సిబ్బంది జీతాలు , డైట్ ఛార్జీలు , నిర్మాణ ఖర్చులు , ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల శాఖల అధికారులు జ్యోతి బుద్ధప్రకాష్ జ్యోతి , బి. షఫియుల్లా, అనితా రామచంద్రన్, క్షితిజ, నిర్మల క్రాంతి వెస్లీ, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు

# గ్రామ సచివాలయ సిబ్బంది పదోన్నతులు షురూ

- అధ్యయనానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీ
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పదోన్నతులపై కసరత్తు ప్రారంభించింది. పదోన్నతుల కల్పనపై అధ్యయనానికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసింది. మొత్తం 10 మంది మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీవోఎం)లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, నారాయణ, డీఎస్బీవీస్వామి, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పదోన్నతులపై అధ్యయనం చేయాలని సబ్ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. ఇంటర్మీడియేటరీ పోస్టుల సృష్టిపై చర్చించాలని, ఒక వేళ పోస్టులను సృష్టించాలనుకుంటే.. పే స్కేల్ నిర్ణయించాలని ఆదేశించింది. ఇతర విభాగాల్లో ప్రమోషన్ ఛానల్ అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించింది. పదోన్నతుల ఖరారుకు ఆయా విభాగాలకు సూచనలు జారీ చేయాలని కోరింది. పదోన్నతుల తర్వాత ఖాళీలు భర్తీ చేసే పద్ధతిపైనా చర్చించాలని సూచించింది. వీలైనంత త్వరగా అధ్యయనం చేసి. సిఫార్సులతో నివేదించాలని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# పూరణ్ కుమార్ ఆత్మహత్య దారుణం

- నిందితులపై చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది
- ప్రధాని, హెూంమంత్రి రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలి
- ఈ సంఘటన మానవ హక్కుల ఉల్లంఘన
- చండీగఢ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి వై.పూరన్ కుమార్ మరణం నన్ను తీవ్రంగా బాధించింది. ఇది నిజంగా చాలా దురదృష్టకరమైన ఘటన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన ఇటీవల కుల వివక్ష భావన, ఉన్నతాధికారుల మానసిక వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన అడిషనల్ డీజీ పురణ్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుమార్ భార్య అమ్నీత్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్లో పరామర్శించి సంఘీభావం తెలిపారు. పూరణ్ కుమార్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్థానిక మీడియాతో మాట్లాడారు.

హరియాణాలో అదనపు డీజీ గా పని చేసిన ఆయన, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'రా' విభాగంలో కూడా సేవలందించారు అని తెలిపారు. ఉత్తమ సేవలకు గాను రాష్ట్రపతి మెడళ్ళను కూడా అందుకున్న ప్రతిభావంతులు ఆయన. అలాంటి గొప్ప అధికారి ఈ నెల 7 న ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచి వేసే అంశం అని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన రాసిన ,మరణ వాగ్మూలం (సూసైడ్ నోట్) లో డీజీపీ కపూర్, ఎస్పీ నరేంద్ర అనే ఇద్దరు అధికారులు తనను అడుగడుగునా అవమానించి, వేధించడం వల్లే చనిపోతున్నానని స్పష్టంగా పేర్కొన్నారు అని తెలిపారు. చట్టం ప్రకారం ఇలాంటి సాక్ష్యం ఉన్నప్పుడు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి కదా అన్నారు. అయితే, రోజులు ఏడు రోజులు గడుస్తున్నా హర్యానా ప్రభుత్వం, చండీగఢ్ పోలీసులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతేకాదు, ఆయన శవపరీక్ష కూడా జరగలేదు. ఆయన మృతదేహానికి ఇప్పటికీ పోస్ట్‌మార్టం కూడా చేయకపోవడం, వృద్ధురాలైన ఆయన తల్లికి, భార్యకు, కూతుళ్లకు కనీశం శవాన్ని చూడటానికి కూడా అనుమతించకపోవడం అత్యంత అమానుషం, దారుణం అన్నారు. ఇది మౌలిక మానవ హక్కుల ఉల్లంఘన. నిందితులలో ఒకరైన మిస్టర్ కపూర్‌పై అప్పటికే కులవివక్ష ఆరోపణలు ఉన్నా, ఆయనను ప్రభుత్వం



డీజీపీగా కొనసాగించడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేళ్లు దాటిన మనిషి కూడా మరింతకాలం బతకాలి అనే కోరుకుంటాడు. చావుబ్రతుకుల్లో హాస్పిటల్ బెడ్డు మీద ఉన్నవారు కూడా 'మాకు బతకాలని ఉంది... మమ్మల్ని కాపాడండి' అని వైద్యులను వేడుకొంటారు. అలాంటిది ఒక ఐపీఎస్ స్థాయి అధికారి ఇక నేను బతకలేను అని చెప్పి ప్రాణం తీసుకున్నారంటే ఆయన ఎంత వేదన అనుభవించి ఉంటారో, ఎంత కష్టం ఆయనకు కలిగి ఉంటుందో ఊహించండి అని డిప్యూటీ సీఎం వివరించారు. ఆయన ఎంతటి అవమానం అనుభవించారో అర్థం ఒక ఐపీఎస్ అధికారికే రక్షణ లేకపోతే ఇక సాధారణ ప్రజల గతి ఏమిటో ఆలోచించండి అన్నారు. మానవ హక్కుల సంఘాలు, పౌర సంఘాలు గడచిన వారం రోజులుగా న్యాయం కావాలని పోరాడుతున్నాయి. నిరసన తెలుపుతున్నాయి. కానీ ప్రభుత్వం ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరణ వాంగ్మూలం ఆధారంగా చండీగఢ్ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకుని ఉండాల్సింది. నిందితులను అరెస్ట్ చేసి ఉండాల్సింది. కానీ వారు ఆ పని ఎందుకు చేయలేదు అని ప్రశ్నించారు. చివరికి ప్రభుత్వం కూడా ఈ విషయంలో నిందులను తక్షణం సస్పెండ్ చేయకుండా మౌనంగా ఉండటం తీవ్ర ఆక్షేపణీయం అన్నారు.

## క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది



- అఖిల భారత పోలీస్ పవర్ లిఫ్టింగ్ క్లస్టర్ పోటీలను ప్రారంభించిన హెూం మంత్రి అనిత
- పోలీసుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే పోటీలు
- పవర్ లిఫ్టింగ్‌తో పాటు, యోగా పోటీలను నిర్వహించటం చాలా సంతోషంగా ఉంది
- హెూం మంత్రి అనిత

ఏపీ స్టేట్ క్రైమ్ బ్యూరో, మేజర్ న్యూస్,అక్టోబర్ 13:- అఖిల భారత పోలీస్ పవర్ లిఫ్టింగ్ క్లస్టర్ పోటీలను రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సోమవారం ఏపీఎస్పీ 6వ బెటాలియన్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా హెూంమంత్రి అనిత మాట్లాడుతూ..ఐదు రోజుల పాటు రెండు ప్రాంతాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోలీసుల క్రీడా స్ఫూర్తిని నింపేందుకు గత ఏడాది ఈ పోటీలు ప్రారంభించామని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత మొదటి సారిగా పోటీలు జరగటం శుభ పరిణామమన్నారు. పవర్ లిఫ్టింగ్‌తో పాటు, యోగా పోటీలను నిర్వహించటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. యోగాలో రాష్ట్రం గిన్నిస్ బుక్ సాధించిన సంగతి తెలిసిందే అని అన్నారు. రాజధానిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. అన్ని రాష్ట్రాల నుంచి 1011 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారని మంత్రి అనిత పేర్కొన్నారు.

## 18న తెలంగాణ రాష్ట్ర బంద్‌ను
# విజయవంతం చేయండి

- రాష్ట్ర బందుతో రిజర్వేషన్ వ్యతిరేకుల కళ్ళు తెరిపిస్తా
- బంద్‌కు అఖిలపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాలి
- బంద్‌లో పార్టీలకతీతంగా బీసీ శ్రేణులు పాల్గొని బీసీల సత్తా చాటాలి
- బంద్ వాల్ పోస్టర్ ఆవిష్కరణలో ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 18న జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్ లో పార్టీలకతీతంగా సమస్త బీసీ శ్రేణులు పాల్గొని బీసీల ఐక్యతను చాటాలని బీసీ జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.నేడు హైదరాబాదులోని గన్ పార్క్ లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద ఈనెల 18న జరిగే బంద్ వాల్ పోస్టర్ ను వైస్ చైర్మన్ విజిఆర్ నారగోని, కో చైర్మన్ రాజారాం యాదవ్, కోఆర్డినేటర్లు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కుందారం గణేష్ చారీ లతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ, జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఈ బందుకు రాష్ట్రంలోని విద్యాసంస్థలు వ్యాపార వర్గాలు అన్ని వర్గాల ప్రజలు సహకరించి బందును విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.బీసీల రాష్ట్ర బంద్ ద్వారా బీసీల ఐక్యతను చైతన్యాన్ని చాటి చెప్పాలని బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని దేశానికి వినిపించడం కోసమే బంద్ చేయాల్సి వస్తుందని బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని ఆయన హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు న్యాయబద్ధంగా రావలసిన రిజర్వేషన్లను కోర్టులను వేదికలుగా చేసుకొని అగ్రకులాలు అడుగడుగునా అడ్డుకుంటున్నారని, ఇది ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.

ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో జరిగే బీసీ ఉద్యమం వ్యక్తుల ప్రయోజనాల కోసం కాదని బీసీ వ్యవస్థకు మేలు జరిగే ఉద్యమం అని, ఈ ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలో ఉన్న బీసీ శ్రేణులు కలిసి వచ్చి ఈనెల 18న జరిగే రాష్ట్ర బంద్ ను చరిత్రలో కనివిని రీతిలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.బీసీల ఆత్మ అభిమానాన్ని దెబ్బతీస్తూ బీసీల రిజర్వేషన్లను తగ్గించాలని కుట్రలు చేసే వాళ్లకు బుద్ధి చెప్పేలా బీసీలు ఉద్యమించే సమయం ఆసన్నమైందన్నారు రాష్ట్ర బంద్ కు అఖిలపక్ష రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఎక్కడికక్కడ బీసీలు జేఏసీలుగా ఏర్పడి బంధను విజయవంతం చేయాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, కనకాల శ్యాంకుర్మా, భూమన్న యాదవ్, భాగ్యలక్ష్మి, వేముల రామకృష్ణ, ఈడిగా శ్రీనివాస్ గౌడ్, చెరుకుల రాజేందర్, జాజుల లింగం గౌడ్, నంద గోపాల్, వరికుప్పల మధు, గుజ్జ సత్యం, రాజు నేత, అనంతయ్యా, పానుగంటి విజయ్ గౌడ్, జిల్లపల్లి అంజి, మాదిష్ రాజేందర్, బి ఆర్ కృష్ణ, నాగుల శ్రీనివాస్ యాదవ్, వారాల శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, రాజ్ కుమార్, గుంటి మహేష్, నరసింహ చారి, తదితరులు పాల్గొన్నారు


# పెట్టుబడుల ఆకర్షణ-ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా విశాఖ సదస్సు

- సీఐఐ భాగస్వామ్య సదస్సు సన్నాహకాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహణ
- సదస్సును విజయవంతం చేసేందుకు ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలకు లోకేష్ ఆహ్వానం
- ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాలని సీఎం నిర్ణయం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకట్టుకోవడం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడంతో పాటు సరికొత్త ఆలోచనలకు సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదిక కావాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను భారత ఆర్థిక, సాంకేతిక ప్రగతిలో అగ్రగామిగా ప్రతిష్ఠించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ సన్నాహకాలపై సచివాలయంలో సోమవారం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సీఐఐ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాలని నిర్ణయించినట్టు సీఎం తెలిపారు. అలాగే వివిధ దేశాల వాణిజ్య మంత్రులను, లీడింగ్-గ్లోబల్ సీఈవోలను ఆహ్వానించాలని నిర్దేశించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పాలసీ థింకర్లు, అకడమిక్స్‌కు సదస్సులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్లోబల్ టెక్ ట్రాన్స్‌ఫర్మేషన్, గ్లోబల్ ట్రస్ట్ పెంచుకోవడం, గ్లోబల్ ట్రేడ్‌లో దేశం వాటా పెరగడం సదస్సు లక్ష్యంగా ఉండాలని సూచించారు. అతిథులకు అన్ని సౌకర్యాలతో ఆతిథ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని, విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు.

**రాష్ట్ర ఆకాంక్షలు ప్రతిబింబించాలి :** 'గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. అలాగే గూగుల్ వంటి అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి. రాష్ట్రం త్వరలోనే కృత్రిమ మేధస్సు, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుంది. సదస్సులో ఈ అంశాలు, రాష్ట్ర ఆకాంక్షలు ప్రతిబింబించాలి. సదస్సు ఏర్పాట్లకు సమయం తక్కువ ఉన్నందున... వేగంగా పనులు పూర్తి చేయాలి. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**విశాఖలో 4వ సారి సీఐఐ సదస్సు :** సీఐఐ భాగస్వామ్య సదస్సు నవ్యాంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం ఇది 4వ సారి. గతంలో 2016, 2017, 2018లో మూడు సార్లు విశాఖలోనే నిర్వహించారు. ఇప్పుడు విశాఖనే సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈసారి సీఐఐ సదస్సు 'టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్-నావిగేటింగ్ ది జియోఎకనామిక్ ఆర్డర్' థీమ్‌తో మొత్తం 13 సెషన్లుగా జరగనుంది. 29 మంది వాణిజ్య మంత్రులు,



80 మంది దేశ, విదేశీ సీఈవోలు, 40 దేశాల నుంచి ప్రతినిధులు, అలాగే 13మంది కేంద్ర మంత్రులు ఈ సదస్సుకు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. జీ20 దేశాలు, మిడిల్ ఈస్ట్, యూరప్, ఆసియా, పశ్చిమాసియా తదితర ప్రాంతాల నుంచి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది.

**ఇవీ సెషన్లు :** ట్రేడ్, జియోఎకనామిక్ ఫ్రేమ్ వర్క్, టెక్నాజజీ-ఇన్నోవేషన్, డిఫెన్స్, ఏరోస్పేస్, హెల్త్ కేర్, బయోటెక్నాలజీ, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్-సప్లయ్ చైన్, సస్టెయినబిలిటీ-క్లీన్ ఎనర్జీ, లెవరేజింగ్ టెక్నాలజీ అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు ఇప్పటికే పలుదేశాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలను మంత్రి లోకేష్ ఆహ్వానించడంతో రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నారా లోకేష్, నారాయణ, ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చందర్జిత్ బెనర్జీ పాల్గొన్నారు.

సూర్య
విజయవాడ
మంగళవారం
14 అక్టోబర్ 2025
4






## భారత్-ఆఫ్ఘన్ వ్యూహాత్మక పొత్తు!

భారత్ మరియు ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఇటీవల బలపడుతున్న దౌత్య సంబంధాలు, ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్ తాలిబాన్ విదేశాంగ మంత్రి భారత పర్యటన వంటి పరిణామాలు పాకిస్తాన్లో తీవ్ర కలవరాన్ని సృష్టిస్తున్నాయి. పాకిస్తాన్కు శత్రువైన ఆఫ్ఘనిస్తాన్తో భారత్ స్నేహాన్ని పెంచుకోవడం ప్రాంతీయ భౌగోళిక రాజకీయాలలో కీలక మార్పుకు సంకేతంగా ఉంది. ఈ కొత్త బంధం భారత్కు అనేక వ్యూహాత్మక ప్రయోజనాలను చేకూర్చనుంది. ముఖ్యంగా, పాకిస్తాన్లో ఉగ్రదాడులకు పాల్పడు తున్న తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ) వంటి సంస్థలకు ఆఫ్ఘనిస్తాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్తాన్ ఆరోపిస్తోంది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలోనే, తాలి బాన్ మంత్రి భారత పర్యటనలో ఉండగా, పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్పై వైమానిక దాడులు జరపడం, ఈ అంశంపై పాకిస్తాన్కున్న అసంతృప్తిని, కడుపు మంటను స్పష్టం చేస్తోంది. ఆఫ్ఘనిస్తాన్తో భారత్ స్నేహం పెరగడం వల్ల భారత్కు ముఖ్యంగా భద్రత మరియు వాణిజ్య రంగాలలో సానుకూలతలు కనిపిస్తున్నాయి. పాకిస్తాన్కు సరిహద్దులో ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడంలో ఆఫ్ఘన్ తాలిబాన్ మద్దతు లభించే అవకాశం ఉంది. భారత్కు వ్యతిరేకంగా ఆఫ్ఘన్ గడ్డను ఉగ్రవాదు లు వాడుకోకుండా నిరోధిస్తామని తాలిబాన్ మంత్రి హామీ ఇవ్వడం భారత్కు ఒక పెద్ద ఉపశమనం. అంతేకాకుండా, పాకిస్తాన్ భూభాగం గుండా ప్రత్యక్ష భూమా ర్గాన్ని నిరాకరించినందున, ఇరాన్లోని చాబహార్ ఓడరేవు అభివృద్ధిలో భారత్ క్రియా శీలకంగా పాల్గొనడం అత్యంత కీలకం. ఈ ఓడరేవు ద్వారా మధ్య ఆసియా దేశాల కు, ఆఫ్ఘనిస్తాన్ మార్కెట్కు చేరుకోవడానికి భారత్కు ప్రత్యామ్నాయ సముద్ర మార్గం లభిస్తుంది. దీనివల్ల పాకిస్తాన్ ఓడరేవులపై ఆధారపడటం తగ్గుతుంది. భౌగోళిక రాజకీయాల పరంగా చూస్తే, ఆఫ్ఘనిస్తాన్లో చైనా ప్రభావం పెరుగుతున్న తరుణం లో, భారత్ తన దౌత్య సంబంధాలను పునరుద్ధరించడం మరియు కాబూల్లోని రాయబార కార్యాలయాన్ని పూర్తి స్థాయి రాయబార కార్యాలయంగా అప్గ్రేడ్ చేయా లనే నిర్ణయం ప్రాంతంలో భారత్ వ్యూహాత్మక ఉనికిని పెంచుతుంది. ఇంకా, ఆఫ్ఘని స్తాన్ తన పొరుగు దేశం అని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వ్యాఖ్యానిం చడం ద్వారా, భారత్-ఆఫ్ఘన్ సరిహద్దుగా ఉన్న లిలిపాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)పై పాకిస్తాన్కు భారత్పరోక్షంగా గట్టి సందేశాన్ని పంపినట్లయింది. మొత్తంమీద, భారత్-ఆఫ్ఘన్ సంబంధాల మెరుగుదల, ప్రాంతీయంగా పాకిస్తాన్ను ఒంటరిని చేయడంలో మరియు భారత్కు వ్యూహాత్మక లోతును పెంచడంలో సహాయపడు తుంది. ఆఫ్ఘనిస్తాన్తో ప్రస్తుతం పెరుగుతున్న స్నేహాన్ని భారత్ స్వాగతించినప్పటికీ, చారిత్రక అనుభవాలు, తాలిబాన్ స్వభావం, మరియు ప్రాంతీయ రాజకీయ అనిశ్చి తి దృష్ట్యా, భారత్ చాలా జాగ్రత్తగా, ఆచి తూచి వ్యవహరించాల్సిన అవసరం ఉం ది. ప్రస్తుత సంబంధాలు భారత్కు ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, పరిస్థితి ఎప్పుడై నా మారే అవకాశం ఉంది. భారతదేశానికి, ఆఫ్ఘనిస్తాన్కు మధ్య చారిత్రక మరియు సాంస్కృతిక సంబంధాలు చాలా లోతుగా ఉన్నాయి. తాలిబాన్లు 2021లో అధి కారం చేపట్టడానికి ముందు, ఆఫ్ఘనిస్తాన్లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉన్నప్పుడు, భార త్ ఆ దేశానికి ముఖ్యమైన మిత్రదేశంగా నిలిచింది. భారత్ ఆ దేశంలో %వి%3 బిలియన్లకుపైగా (సుమారు ?25,000 కోట్లు) భారీగా పెట్టుబడులు పెట్టింది. ముఖ్యంగా పార్లమెంట్ భవనం నిర్మాణం మరియు కీలకమైన సల్మా ఆనకట్ట (ఇం డియా-ఆఫ్ఘనిస్తాన్ ఫ్రెండ్షిప్ డ్యామ్) వంటి పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టలను నిర్మించింది. అయితే, 1996లో తొలిసారి తాలిబాన్లు అధికారం చేపట్టిన ప్పుడు, భారత్ వారి పాలనను గుర్తించలేదు. ఆ సమయంలో పాకిస్తాన్ మరియు తాలిబాన్ చాలా దగ్గరగా ఉండేవి, ఇది భారత్కు వ్యతిరేకంగా పని చేసింది. 1999 లో ఇండియన్ ఎయిర్లైన్స్ విమానం ఐసీ 814 హైజాక్ చేసి కందహార్కు తరలించిన చేదు అనుభవం ఈ చరిత్రలో భాగం. ఈ గతం భారత్ను నిరంతరం అప్రమత్తం చేస్తూ ఉండాలి. తాలిబాన్ విదేశాంగ మంత్రి ముత్తాకీ పర్యటన, దౌత్య కార్యాల యాన్ని తిరిగి ప్రారంభించడం వంటి సానుకూల పరిణామాలు ఉన్నప్పటికీ, భారత్ భద్రత విషయంలో రాజీ పడకూడదు. ఫ్ఘన్ భూమిని భారత్కు వ్యతిరేకంగా ఉపయో గించకుండా తాలిబాన్ నాయకులు హామీ ఇచ్చినా, ఆ హామీ ఎంతవరకు నిలబడు తుందో చూడాలి. ఎందుకంటే తాలిబాన్ సంస్థలోని వివిధ వర్గాలు, అలాగే ఇతర ఉగ్రవాద సమూహాలు (ఉదాహరణకు, ఐసిస్-ఖోరాసన్) ఇప్పటికీ అక్కడ చురు కుగా ఉన్నాయి. అంతేగాక, తాలిబాన్ ప్రభుత్వానికి ఇప్పటికీ అంతర్జాతీయంగా పూర్తి గుర్తింపు లేదు. తాలిబాన్ ఒక మతపరమైన, కఠినమైన విధానాలను అనుస రించే సంస్థ కాబట్టి, వారి విధానాలు ఎప్పుడు, ఎలా మారతాయో ఊహించడం కష్టం. ఆ దేశంలో మహిళల హక్కులు, మానవ హక్కుల ఉల్లంఘనలపై అంతర్జా తీయ సమాజంలో వ్యతిరేకత ఉండటం కూడా భారత్ తీసుకునే నిర్ణయాలపై ప్రభా వం చూపే అవకాశం ఉంది. వ్యూహాత్మక కోణం నుంచి చూస్తే, ప్రస్తుతం పాకిస్తాన్-తాలిబాన్ల మధ్య సంబంధాలు క్షీణించినప్పటికీ, ఈ చారిత్రక మిత్రుల మధ్య ఏ సమయంలోనైనా సమీకరణాలు మారవచ్చు. పాకిస్తాన్ మళ్లీ తాలిబాన్ను తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నించవచ్చు. అందుకే, పాకిస్తాన్ వైరిత్వంతో ఆఫ్ఘనిస్తాన్ను ఉపయోగించుకోవడానికి ప్రయత్నించడం కంటే, ఆఫ్ఘన్ ప్రజల అభివృద్ధిపై దృష్టి పెట్టడం భారత్కు దీర్ఘకాలికంగా ప్రయోజనకరం. అలాగే, ఆఫ్ఘని స్తాన్లో చైనా మరియు రష్యా వంటి దేశాల ప్రభావం పెరిగే అవకాశం ఉంది. భారత్ తన ఆసక్తిని కాపాడుకోవాలంటే, కేవలం వాణిజ్య-మానవతా సహాయాలకే పరిమి తం కాకుండా, వ్యూహాత్మకంగా కూడా చురుకుగా ఉండాలి. మొత్తంమీద, తాలి బాన్ల నుంచి భారత్కు లభించిన హామీ సానుకూలమే అయినప్పటికీ, గత అనుభవా లను దృష్టిలో ఉంచుకుని, భారత్ నిదానంగా, వ్యూహాత్మకంగా తమ సంబంధాలను ముందుకు తీసుకెళ్లాలి. తాలిబాన్ల మాటల కంటే, వారి చేతలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం అవసరం. ఆఫ్ఘనిస్తాన్లో తాలిబాన్ అధికారంలోకి వచ్చిన తర్వాత, దానితో భారత్ దౌత్యపరంగా చురుగ్గా వ్యవహరించడం కేవలం పాకిస్తాన్ను ఎదుర్కోవడానికి మాత్రమే కాదు. ఈ పొత్తు ద్వారా భారత్ దీర్ఘకాలికంగా, భౌగోళిక-రాజకీయపరంగా అనేక కీలక ప్రయోజనాలను సాధించాలని చూస్తోంది. వీటిలో ప్రధానమైనది మధ్య ఆసియా దేశాలకు భౌగోళిక అనుసంధానం పెంచుకోవడం. పాకిస్తాన్ తమ భూభాగాన్ని వాణిజ్యానికి ఉపయోగించడానికి నిరాకరిస్తున్నందున, ఆఫ్ఘనిస్తాన్ను ముఖ్యమైన రవాణా కేంద్రంగా వాడుకోవాలని భారత్ భావిస్తోంది. ఇరాన్లోని చాబహార్ ఓడరేవు ద్వారా సముద్ర మార్గాన్ని ఉపయోగించి, ఆఫ్ఘనిస్తాన్ మీదుగా తుర్కమేనిస్తాన్, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్ వంటి శక్తివంతమైన మధ్య ఆసియా దేశాల మార్కెట్లను చేరుకోవడానికి ఈ పొత్తు కీలకం. ఈ అనుసంధానం ఆసియాలో చైనా యొక్క బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ప్రభావాన్ని ఎదుర్కోవడానికి భారత్కు ఒక బలమైన వాణిజ్య మార్గాన్ని ఇస్తుంది. వ్యూహాత్మక భద్రత మరియు ప్రాంతీయ స్థిరత్వం పరంగా కూడా ఆఫ్ఘనిస్తాన్ స్నేహం ముఖ్యమైనది. తాలిబాన్తో సంబంధాలు మెరుగుపరచుకోవడం వల్ల, తమ ప్రాంతంలో ఉగ్రవాద స్థావరాలు ఏర్పడకుండా చూసుకోవాలని భారత్ కోరుకుంటోంది. ఆఫ్ఘన్ గడ్డపై నుంచి భారత్కు వ్యతిరేకంగా ఉగ్రవాదం వ్యాపించకుండా తాలిబాన్ల నుంచి నేరుగా హామీ తీసుకోవడం అత్యంత కీలకమైన భద్రతా ప్రయోజనం. ఇది కాకుండా, ఆఫ్ఘనిస్తాన్ పునర్నిర్మాణంలో, ముఖ్యంగా మానవతా సహాయం మరియు అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా తమ ఉనికిని కొనసాగించడం ద్వారా, ఆఫ్ఘన్ ప్రజల విశ్వాసం మరియు స్నేహాన్ని భారత్ తిరిగి గెలుచుకోవచ్చు. ఈ ప్రజా సంబంధాలు దీర్ఘకాలికంగా ఆఫ్ఘన్ రాజకీయాలపై భారత్ ప్రభావాన్ని పెంచుతాయి. చివరికి, ప్రాంతీయ వేదికలపై భారత్ నాయకత్వాన్ని బలపరుచుకోవడానికి ఈ పొత్తు ఉపయోగపడుతుంది. షాంఘై సహకార సంస్థ వంటి బహుపాక్షిక వేదికలలో, ఆఫ్ఘనిస్తాన్ భద్రత మరియు స్థిరత్వంపై చర్చలు జరుగుతున్నప్పుడు, తాలిబాన్తో నేరుగా సంభాషణలు కలిగి ఉండటం వల్ల భారత్ తన అభిప్రాయాలను బలంగా వినిపించే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా, చారిత్రక బంధాలు, సాంస్కృతిక సంబంధాల పునరుద్ధరణ ద్వారా, ఆఫ్ఘనిస్తాన్ రాజకీయాలలో చైనా మరియు ఇతర ప్రాంతీయ శక్తుల ప్రభావం పెరగకుండా భౌగోళిక రాజకీయ సమతుల్యతను సాధించడానికి భారత్కు ఆఫ్ఘన్ స్నేహం ఒక అద్భుతమైన అవకాశం. ఈ పొత్తు భారత్ను దక్షిణాసియాలో ఒక స్థిరమైన మరియు బాధ్యతాయుతమైన శక్తిగా నిలబెడుతుంది. భారత్ మరియు ఆఫ్ఘనిస్తాన్ మధ్య ప్రస్తుతం చిగురిస్తున్న దౌత్య బంధం కేవలం పాకిస్తాన్కు వ్యతిరేకంగా ఏర్పడిన తాత్కాలిక వ్యూహం మాత్రమే కాదు, ప్రాంతీయ భౌగోళిక రాజకీయాలలో భారత్ యొక్క సుదూర లక్ష్యాలను ప్రతిబింబిస్తుంది. పాకిస్తాన్ను పక్కన పెట్టి చూసినా, చాబహార్ ఓడరేవు ద్వారా మధ్య ఆసియాకు విస్తృత వాణిజ్య అనుసంధానం మరియు ఆసియాలో చైనా యొక్క పెరుగుతున్న ప్రభావాన్ని అడ్డుకోవడానికి ఇది ఒక ముఖ్యమైన మార్గం. ఆఫ్ఘన్ గడ్డపై ఉగ్రవాద బెడదను నివారించడానికి తాలిబాన్ల నుంచి హామీ పొందడం అనేది భారత్ భద్రతా ప్రయోజనాలకు అత్యంత కీలకం. ఈ విధంగా, ఆఫ్ఘనిస్తాన్తో స్నేహం అనేది వ్యూహాత్మక లోతును పెంచుకోవడానికి మరియు దక్షిణాసియాలో భారత్ను ఒక స్థిరమైన, కీలక శక్తిగా నిలబెట్టడానికి దారితీస్తుంది. అయితే, ఈ బంధంలో ఉన్న చారిత్రక హెచ్చుతగ్గులు మరియు తాలిబాన్ల అస్థిర స్వభావం కారణంగా భారత్ తప్పనిసరిగా జాగ్రత్తగా వ్యవహరించాలి. 1990ల నాటి అనుభవాలు, తాలిబాన్ల విధానాలు ఎప్పుడైనా మారే అవకాశం ఉన్న విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. అందువల్ల, భారత్ తన అభివృద్ధి మరియు మానవతా సహాయ కార్యక్రమాలను కొనసాగిస్తూనే, తాలిబాన్ల మాటల కంటే చేతలను బేరీజు వేయాలి. ఈ వ్యూహాత్మక పొత్తును నిదానంగా, పకడ్బందీగా ముందుకు తీసుకువెళ్లడం ద్వారానే, భారత్ తన భద్రతా, ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చుకుంటూ, ప్రాంతీయ అనిశ్చితిని సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతుంది.

# అసాధారణనేత చంద్రబాబు నాయుడు

- కృషి ఉంటే మనుషులు ఋషులవుతారనేందుకు నిలువెత్తు నిదర్శనం
- వినయం, అహంకారాలు విశేషంగా అందరినీ ప్రభావితం చేయగల సత్తా
- ఎదుటి వారి హృదయాన్ని జయించి వారి మన్ననలతో ఎదిగిన వైనం
- సాధారణ కుటుంబం నుంచి ప్రజా జీవితంలో మరో అసాధారణ మైలురాయిని దాటిన తీరు
- రాజకీయ దిగ్గజాలను ఎందరో గండరగండలను ఎదుర్కొన్న నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం






వాసంశెట్టి సుభాష్
కార్మికశాఖ మంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, మహాపురుషులవుతారు అనే మాట ఊరికేరాలేదేమో అందుకు ప్రత్యక్ష నిదర్శనం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు. ఎవరైనా పట్టుదల, కృషి చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదు. కష్టపడితే, ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. కడుపు నిండా తిండి లేకపోయి నా బాధపడకుండా, కసిగా, పట్టుదలతో పనిచేస్తే గొప్ప వ్యక్తులుగా ఎదగవచ్చు అనడానికి చంద్రబాబే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. మనిషిఎదుగుదలకు వినయం, అహంకారాలు విశేషంగా ప్రభావితంచేస్తాయి. అహంకారం అంతమొందిస్తే ఎదుగు దలకు అర్హుడవుతాడు. వినయం జ్ఞానం తోడు అవుతుంది. విధేయత వున్న వారికి లోకం జేజేలు కొడుతుంది. సత్యం,ధర్మం తప్పని వానికి ఈ ప్రకృతే ఎదుగుదలకు సహకరిస్తుంది . ఈ రెండు వున్న హరిశ్చంద్రుడు, ధర్మరాజు, కర్ణుడు ఎంతో ఎత్తు కు ఎదిగారు. "ప్రియం భూయాత్,సత్యం భూయాత్,న భూయాత్ సత్య మప్రియం" అన్నారు మనువు తన మనుచరిత్రలో. అంటే ప్రియంగా మాట్లాడని,సత్యం మాట్లాడే వారు ఎదుటి వారి హృదయాన్ని జయించి వారి మన్ననలతో ఎదుగుతాడు. ఆ కోవకు చెందిన వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు.

నారా వారి' కుర్రోడు! చిన్న పల్లెలో పుట్టాడు! ఇంతింతై ఎదిగాడు! ఇతరులు అందు కోలేనంత ఎత్తున నిలిచాడు! 'ఒక సామాన్యుడు ఇంత స్థాయికి రాగలడు' అనేం దుకు నిదర్శనంగా నిలిచాడు నారా చంద్రబాబు నాయుడు! ఉమ్మడి రాష్ట్రానికి రెండు సార్లు, విభజిత రాష్ట్రానికి రెండుసార్లు ఆయన ముఖ్యమంత్రి! అందరూ 1996లో ఉన్నప్పుడు ఆయన '2020' గురించి కలగన్నారు.. ఇప్పుడు 2025లో ఉంటూ... '2047'ను దర్శిస్తున్నారు. ఆయనొకస్వాప్నికుడు! రాజకీయాల్లో సాహసి కుడు! లోతైన ఆలోచనల అపరచాణక్యుడు'! ఎవరికీ లొంగని మొండివాడు! అంత టి చంద్రబాబు నాయుడు. ప్రజా జీవితంలో మరో అసాధారణ మైలురాయిని చేరు కున్నారు. రాజకీయ కుటుంబనేపథ్యం, బలమైన పునాది లేకుండా తిరుపతికి సమీ పంలోని ఒక చిన్న గ్రామం నుంచి ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన, ముఖ్యమంత్రి హోదాలో ఏకంగా 15 సంవత్సరాల అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఆయన ఇటీవల ముఖ్యమంత్రిగా 15 సంవత్సరాలను పూర్తి చేసుకున్నారు. అపరచాణక్యుడిగా, రాజకీయ దురంధరుడిగా ఈ 45 ఏళ్ల పొలిటికల్ కెరీర్లో ఎన్నో ఎత్తుపల్లాలను ఎదుర్కొన్నారు చంద్రబాబునాయుడు. ఆయన నడక పూలబాట కాదు.. ఆయన ఎదుర్కొంది ఆశామాషీ నేతలను కాదు.. ఎందరో గండరగండలు.. రాజకీయ దిగ్గజాలను ఎదుర్కొని అపజయాలతో పాటు విజయాలు సాధిస్తూ ముం దుకు వెళ్తున్నారు. అపజయానికి కుంగిపోకూడదు.. విజయానికి పొంగిపోకూ డద న్న సిద్ధాంతాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ తన పార్టీ పతాకాన్ని ఆంధ్ర దేశం లో రెపరెపలాడిస్తున్నారు. అభివృద్ధి, సాంకేతిక నైపుణ్యం అనే పదాలను రెండు కళ్ల లా చేసుకుని ప్రస్తుతం ఏపీలో సీఎంగా పరిపాలన సాగిస్తున్నారు. ఏజ్ అనేది ఓ నెంబర్ మాత్రమే అనిపదేపదే చెబుతూ వస్తున్న ఆ రాజకీయ దిగ్గజం.. ప్రస్తుతం ఏ.పీ. సీఎం చంద్రబాబు..చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది నాలుగోసారి. 1995, సెప్టెంబర్ 1న ఆయన సీఎంగా పగ్గాలు చేపట్టారు. ఆనాటినుంచి నేటి వరకు ఆయన పదవీకాలాన్ని లెక్కిస్తే ముఖ్యమంత్రి గా ఆయన 15 ఏళ్లు పూర్తి చేసుకున్న అసాధారణ నేతగా నిలిచారు.

**దక్షిణాదిలో కొందరికే ఈ ఘనత:** దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పని చేసిన నేతలు చాలా మంది ఉన్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాల్లో ఈ ఘనత సాధించిన నాయకులు అతి కొద్ది మంది మాత్రమే. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి (దాదాపు 19 ఏళ్లు), పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి (16 ఏళ్లకు పైగా) తర్వాత, దక్షిణ భారతదేశంలో 15 ఏళ్ల రికార్డును అధిగమించిన ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడే కావడం విశేషం. ఎంజీ రామచంద్రన్, జయలలిత, రామకృష్ణ హెగ్డే వంటి ప్రముఖులు కూడా తమ రాజకీయ జీవితంలో ఈ మార్కును చేరుకోలేకపోయారు.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోరికార్డు :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కు అత్యధిక కాలం ముఖ్య మంత్రిగా పనిచేసిన రికార్డు కూడా చంద్రబాబు నాయుడు ఖాతాలోనే ఉంది. ఆయన ఉమ్మడి ఏపీకి 8 ఏళ్ల 255 రోజులు సీఎంగా సేవలందించారు. ప్రస్తుతం నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలం ఆరేళ్లా 110 రోజులు పూర్తి చేసుకుంది. మొత్తంగా ఈ రెండు కాలాలను కలిపితే 15 ఏళ్ల మార్కును దాటారు.

**విజన్తో కూడినసంస్కరణలు :** చంద్రబాబు నాయుడు పాలనా విధానం ఎప్పుడూ దూరదృష్టితో కూడిన సంస్కరణల చుట్టూ తిరుగుతుంది. సింగపూర్ వ్యవస్థాపక ప్రధాని లీ క్వాన్ యూ పాలన స్ఫూర్తితోనే ఆయన విజన్-2020, విజన్-2047 వంటి లక్ష్యాలను రూపొందించారు. ఆయన తీసుకునే నిర్ణయాలు మొదట్లో వ్యతిరేకతను ఎదుర్కొన్నా, వాటి ఫలితాలు భవిష్యత్తు తరాలకు మేలు చేస్తాయని పదేపదే నిరూపితమైంది. హైదరాబాద్ ఐటీ రంగానికి ఊపిరి పోసిన హైటెక్ సిటీ నిర్మాణం, లక్షల మందికి ఉపాధి కల్పించడం ఇందులో ప్రధానం.

ఎక్కువ ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి ఇవ్వడం ద్వారా నేడు తెలుగు రాష్ట్రాల్లో ఇంటికో ఇంజనీరు ఉండే పరిస్థితికి పునాది వేశారు. 1999లో చేపట్టిన విద్యుత్తు సంస్కరణలు అప్పట్లో రాజకీయంగా పార్టీకి నష్టం కలిగించినా, నేడు కోతలు లేని విద్యుత్ సరఫరాకు దారి తీశాయి. నదుల అనుసంధానం చేపట్టి, గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపారు. అమరావతి రూపంలో ఒక బృహత్తర నగరాన్ని నిర్మించాలనే గొప్ప కల ఆయన విజన్కు నిదర్శనం.

**సంక్షోభాల నుంచి విజయం వైపు ప్రస్థానం:** చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం సంక్షోభాలు, సంస్కరణల పంథాలో సాగింది. 2004 ఎన్నికల్లో ఓటమి తర్వాత పదేళ్లపాటు అధికారానికి దూరంగా ఉన్నా, పార్టీని పదిలంగా కాపాడుకు న్నారు. 2014లో విభజిత ఏపీకి ముఖ్యమంత్రిగా గెలిచి, తిరిగి అధికారం చేప ట్టారు. 2019లో అధికారానికి దూరమైన తర్వాత, కనీవినీ ఎరుగని నిర్బంధాన్ని, అరెస్టును సైతం ఎదుర్కొన్నారు. అయినప్పటికీ, ఆ సంక్షోభాన్ని అధిగమించి, 2024లో భారీ మెజార్టీతో కూటమితో కలిసి తిరిగి అధికారంలోకి రావడం ఆయన అసామాన్య పోరాట పటిమకు నిదర్శనం. ప్రజలకు సంపద సృష్టించడం, సంక్షేమం అమలు చేయడమే లక్ష్యంగా ఆయన పాలన కొనసాగుతోంది.

**విలక్షణ శైలి:** చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి తనను తాను నిరూపించుకోవడానికే ప్రాధాన్యతనిస్తారు, కేంద్రం ఇప్పుడు అమలు చేస్తున్న అనేక పథకాలకు ఆద్యుడు చంద్ర బాబు నాయుడే. పచ్చదనం పరిశుభ్రత, డయల్ యువర్ సీఎం, పరిమిత వడ్డీ రుణాలు, స్వయం సహాయక బృందాలు వంటి రకరకాల కార్యక్రమాలకు అప్పట్లోనే ఎ.పి.లో శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా వాటిని విజయవంతంగా నడిపించారు కూడా. ఇక ప్రజలను దగ్గర చేసుకునే కార్యక్రమం కోసం చాలానే శ్రమ పడ్డారు. జన్మభూమి,శ్రమదానం, ప్రజల వద్దకు పాలన ఇలాంటి విలక్షణ కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కాగలిగారు. ఇలా ఎప్పుడూ ప్రజల్లో ఉంటూ ప్రచారంలో తనదైన ముద్ర వేసుకున్నారు.

గడిచిన నాలుగు దశాబ్దాల అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్ర నుంచి చంద్రబాబు నాయుడు రాజకీయ, జీవిత చరిత్ర వేరు చేయడం కుదిరే వ్యవహారం కాదు. 1995లో ఆయన తొలిసారి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కోట్ల విజయ భాస్కరరెడ్డి మొదలు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వరకు రాజకీ య ప్రత్యర్థులు వచ్చి వెళ్లారు. చరిత్రకే పరిమిత మయ్యారు. కానీ చంద్రబాబు నాయుడు తిరుగులేని నాయకునిగా ఇటు ముఖ్యమంత్రిగా, అటు ప్రతిపక్షనేతగా చరిత్ర సృష్టించారు. ఎప్పటికీ ప్రజల పక్షాన నిలిచి నిఖార్సయిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్నారు చంద్రబాబునాయుడు.

**చంద్రబాబుతో పని చేయడం అదృష్టం** రాజకీయ దురంధరుడు చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వంలో మంత్రిగా పని చేసే అవకాశం దక్కడం నా పూర్వ జన్మ సుకృతం. ప్రజా జీవితంలో సుదీర్ఘ ప్రయాణాన్ని, దశాబ్దాల రాజకీయ నాయకత్వం, పాలన, ప్రజా సేవను సూచిస్తుంది. అటు వంటి చంద్ర బాబుతో పని చేసే అవకాశంతనకు లభించడం తన అదృష్టంగా భావిస్తున్నాను. తెలుగు ప్రజలకు గర్వకారణమైన నాయకుడు,చంద్రబాబు మరెన్నో రికార్డులు సాధించాలని ఆకాంక్షిద్దాం.

# ఆర్కిటిక్ రేసులో భారత్ ఎక్కడా?

- ప్రపంచ శక్తి గా మారుతున్న ఆర్కిటిక్ మహాసముద్రం
- ఆర్కిటిక్ భౌగోళిక రాజకీయాల్లో వేగవంతమైన కొత్త మలుపులు
- పరిశోధన - మౌలిక సదుపాయాల పేరుతో రష్యాతో కలిసి చైనా భారీ పెట్టుబడులు
- ఫిన్లాండ్ - అమెరికాల మధ్య కుదిరిన ఐస్బ్రేకర్ నౌకల ఒప్పందం
- రష్యా - చైనాలకు దీటుగా ఉనికిని బలోపేతం చేసుకుంటున్న అగ్రరాజ్యం




తేజస్విని
హైదరాబాద్

ఒకప్పుడు మంచుతో గడ్డకట్టిన సుదూర ఉత్తర ప్రాంతంగా భావించిన ఆర్కిటిక్ మహాసముద్రం ఇప్పుడు ప్రపంచ శక్తి కేంద్రాల దృష్టిని ఆకర్షిస్తోంది. వాతావరణ మార్పుల కారణంగా మంచు కరిగిపోవడంతో, ఇక్కడ కొత్త వాణిజ్య మార్గాలు, అపారమైన సహజ వనరులు మరియు భద్రతా సవాళ్లు బహిర్గతమయ్యాయి. ఈ కీలక సమయంలో, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరియు ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ల మధ్య ఇటీవల కుదిరిన కీలకమైన ఐస్బ్రేకర్ నౌకల ఒప్పందం ఆర్కిటిక్ భౌగోళిక రాజకీయాల్లో ఒక కొత్త మరియు వేగవంతమైన మలుపునకు సంకేతం. ఈ ఒప్పందం ద్వారా, రష్యా మరియు చైనాలకు దీటుగా తమ ఉనికిని బలోపేతం చేసుకోవడానికి అమెరికా చేస్తున్న తీవ్ర ప్రయత్నాన్ని స్పష్టం చేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఈ సున్నితమైన ప్రాంతంలో భారత్ తన వైఖరిని, ప్రణాళికలను వేగవంతం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

అమెరికా తన మిత్రదేశమైన ఫిన్లాండ్తో కుదుర్చుకున్న ఈ ఒప్పందం, భద్రతను తక్షణమే బలోపేతం చేయడానికి చేసిన అత్యవసర వ్యూహం. అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా దేశ భద్రత దృష్ట్యా, అమెరికా తీర రక్షక దళ నౌకలను విదేశాలలో నిర్మించాలనే నియమాన్ని తాత్కాలికంగా సడలించారు. అమెరికాకు మొత్తం పదకొండు ఆర్కిటిక్ సెక్యూరిటీ కట్టర్ల (మధ్యస్థాయి ఐస్బ్రేకర్లు) అవసరం ఉండగా, నిర్మాణంలో ఆలస్యం అవుతున్న దేశీయ కార్యక్రమాన్ని పక్కనపెట్టి, నాలుగు నౌకలను ఫిన్లాండ్లోని షిప్యార్డులలో నిర్మించడానికి అనుమతి ఇచ్చారు. మిగిలిన ఏడు అమెరికాలో ఫిన్లాండ్ సాంకేతిక సహకారంతో నిర్మించబడతాయి. విదేశీ శక్తుల సైనిక దురాక్రమణ మరియు ఆర్థిక ఆక్రమణ కారణంగా అమెరికా సార్వభౌమాధికారం మరియు కీలకమైన రవాణా మార్గాలు ప్రమాదంలో పడ్డాయని వైట్హౌస్ పేర్కొంది. 1976 నాటి పురాతన ఐస్బ్రేకర్లతో తమ జాతీయ భద్రతకు ముప్పు ఉందని గుర్తించి, ఫిన్లాండ్లోని అత్యాధునిక నౌకానిర్మాణ నైపుణ్యాన్ని ఉపయోగించుకోవాలని అమెరికా నిర్ణయించింది.

అమెరికా ఇప్పుడు చురుకైనప్పటికీ, ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యా మరియు చైనా చాలా కాలంగా ముందంజలో ఉన్నాయి. ఆర్కిటిక్ మహాసముద్రంలో ఎక్కువ తీర ప్రాంతం కలిగిన దేశం రష్యా. ఇది ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద ఐస్బ్రేకర్ నౌకాదళాన్ని కలిగి ఉంది. రష్యా తమ ఉత్తర సముద్ర మార్గాన్ని (నార్తర్న్ సీ రూట్) పూర్తిగా వాణిజ్యానికి ఉపయోగించుకోవడానికి భారీగా పెట్టుబడులు పెడుతూ, ఆ ప్రాంతంలో కొత్త సైనిక స్థావరాలను నిర్మించింది. మరోవైపు, భౌగోళికంగా ఆర్కిటిక్లో తీరం లేకపోయినా, చైనా తనను తాను 'సమీప ఆర్కిటిక్ శక్తి'గా ప్రకటించుకుంది. చైనా పరిశోధన మరియు మౌలిక సదుపాయాల పేరుతో రష్యాతో కలిసి భారీ ఆర్థిక పెట్టుబడులు పెడుతోంది. చైనా లక్ష్యం తమ పోలార్ సిల్క్ రూట్ (ధ్రువ పట్టు రహదారి) ద్వారా ప్రపంచ వాణిజ్య మార్గాలను విస్తరించుకోవడమే. ఈ రెండు దేశాలు ముందుగానే బలమైన స్థావరాలను నిర్మించుకోవడం వల్ల, అమెరికా వంటి దేశాలు ఇప్పుడు అత్యవసరంగా వారిని చేరుకోవడానికి ప్రయత్నించాల్సి వచ్చింది.

ఆర్కిటిక్లో తమ భద్రతా సామర్థ్యాన్ని వేగంగా పెంచుకోవాలనే లక్ష్యంతో, అమెరికా మరియు ఫిన్లాండ్లు కేవలం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయడమే కాకుండా, నౌకల నిర్మాణం మరియు సాంకేతికతకు సంబంధించిన నిర్దిష్ట వివరాలను కూడా పంచుకున్నారు. ఈ ఒప్పందం కింద, మొత్తం పదకొండు మధ్యస్థాయి ఐస్బ్రేకర్లు (ఆర్కిటిక్ సెక్యూరిటీ కట్టర్స్ - ఏఎస్సీలు) నిర్మితం కానున్నాయి. వీటిలో నాలుగు నౌకలు ఫిన్లాండ్లోని రెండు వేర్వేరు షిప్యార్డులలో నిర్మించబడతాయి. మిగిలిన ఏడు నౌకలు ఫిన్లాండ్ ప్రైవేట్ రంగ షిప్బిల్డర్ల సహాయంతో అమెరికాలోనే నిర్మించబడతాయి. ఈ నిర్ణయం, 1976 నాటి పురాతన ఐస్బ్రేకర్లతో మరియు దేశీయ నిర్మాణంలో ఆలస్యంతో సతమతమవుతున్న అమెరికా తీర రక్షక దళానికి తక్షణ పరిష్కారం ఇవ్వడానికి ఉద్దేశించిన అత్యవసర వ్యూహం.

ఈ ఒప్పందంలో రెండు విభిన్న నౌకా నమూనాలు (డిజైన్లు) ఉన్నాయి. ఇది నిర్మాణ వేగాన్ని మరియు దేశీయ నైపుణ్యాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది. మొదటిది, ఎంపీపీఎస్-100 డిజైన్ (ఎం పి పి ఎస్ -100). హెల్సింకి షిప్యార్డ్ రూపొందించిన ఈ నమూనాలో మొదట రెండు నౌకలు ఫిన్లాండ్లో నిర్మించబడి, ఆ తర్వాత దేవి సంస్థ గాల్వెస్టన్, టెక్సాస్లోని తమ నూతన సదుపాయంలో మూడు నౌకలను నిర్మించనుంది. రెండవది, మల్టీ-పర్పస్ ఐస్బ్రేకర్ (ఎంపీఐ) డిజైన్. ఈ నమూనాను మొదట కెనడియన్ తీర రక్షక దళం కోసం రూపొందించారు. ఫిన్లాండ్లోని రౌమా మెరైన్ కన్స్ట్రక్షన్స్ ఈ నమూనాలో రెండు నౌకలను నిర్మించనుంది. ఇదే నమూనాలో మరో నాలుగు నౌకలను లూసియానాలోని బాలింగర్ షిప్యార్డ్ నిర్మించనుంది. ఈ నమూనాను అవసరమైతే తుపాకులు మరియు ఇతర ఆయుధ వ్యవస్థలకు అనుగుణంగా మార్చుకోవచ్చు.

అమెరికా తీర రక్షక దళం ప్రస్తుతం ఉన్న ఐస్బ్రేకర్లు చాలా పాతవిగా,అలాగే తగిన సంఖ్యలో లేకపోవడంతో, దేశ భద్రతకు ఏర్పడిన తక్షణ ప్రమాదాన్ని నివారించడానికి ఈ ఒప్పందం తప్పనిసరైంది. ఈ నౌకల నిర్మాణాన్ని విదేశాలలో చేపట్టడం వల్ల, మొదటి నౌకలను 2028 నాటికే అందుకోవచ్చని అంచనా. ఈ వేగవంతమైన చర్య ద్వారా, ఆర్కిటిక్లో విదేశీ శక్తులు సృష్టిస్తున్న భూభాగ ఆక్రమణ మరియు సైనిక దురాక్రమణ వంటి ముప్పులను అమెరికా ఎదుర్కోవాలని చూస్తోంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికన్లకు ఉద్యోగాలు లభిస్తాయని, నూతన సాంకేతికత దేశానికి చేరుతుందని కూడా శ్వేతసౌధం (వైట్హౌస్) పేర్కొంది. అయినప్పటికీ, నౌకానిర్మాణానికి సంబంధించిన తుది కాంట్రాక్టులు మరియు వాణిజ్య ఒప్పందాలు ఇంకా కుదరలేదు. అమెరికా తీర రక్షక దళం తన ప్రణాళికను తదుపరి సమీక్ష కోసం జాతీయ భద్రతా సలహాదారుకు అరవై రోజుల్లో సమర్పించవలసి ఉంది. అయినప్పటికీ, ఈ అవగాహన ఒప్పందం (మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్) పశ్చిమ దేశాల నౌకా నిర్మాణ పరిశ్రమకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చే చారిత్రక సహకారానికి నాంది పలికింది.

ఆర్కిటిక్ విషయంలో భారత్ ఇప్పటికీ ప్రధానంగా శాస్త్రీయ పరిశోధనలకే పరిమితమై ఉంది. ఆర్కిటిక్లో భారత్ యొక్క హిమాద్రి పరిశోధనా కేంద్రం ఉన్నప్పటికీ, ఈ ప్రాంతం యొక్క భౌగోళిక-రాజకీయ ప్రాముఖ్యతకు అనుగుణంగా వ్యూహాత్మక ప్రణాళికను భారత్ వేగవంతం చేయలేకపోయింది. ఆర్కిటిక్ కౌన్సిల్లో పరిశీలక దేశంగా ఉన్నప్పటికీ, ఈ కీలకమైన సమయంలో దాని ప్రభావం చాలా తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో, భారత్ తక్షణమే కొన్ని కీలక చర్యలు చేపట్టాలి. కేవలం పరిశోధనకు మాత్రమే కాకుండా వ్యూహాత్మక మరియు వాణిజ్య ప్రయోజనాల కోసం ఒక సమగ్రమైన ఆర్కిటిక్ పాలసీని వెంటనే రూపొందించాలి. ఐస్బ్రేకర్ నౌకలను యుద్ధ ప్రాతిపదికన సమకూర్చుకోవడం లేదా దేశీయంగా నిర్మించడంపై దృష్టి పెట్టి, సాంకేతికత కోసం మిత్రదేశాల సహకారాన్ని తీసుకోవాలి.

అంతేకాకుండా, ఆర్కిటిక్లో చురుకుగా ఉన్న మిత్రదేశాలతో భద్రతా చర్చలు ప్రారంభించాలి. అత్యంత ముఖ్యంగా, ఆర్కిటిక్ వనరులలో మరియు ఉత్తర సముద్ర మార్గం యొక్క నియమ నిబంధనల రూపకల్పనలో భారత్ తన వాటాను, హక్కును సమర్థవంతంగా వినియోగించుకోవడానికి దౌత్యపరంగా మరింత చురుగ్గా వ్యవహరించాలి. ఆర్కిటిక్ అనేది ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రాంతం. అమెరికా-ఫిన్లాండ్ ఒప్పందం, రష్యా-చైనాల ముందంజను సమం చేయడానికి ఒక శక్తివంతమైన ప్రయత్నం. ఈ సమయంలో, భారత్ ఇక ఆలస్యం చేయకుండా, కేవలం పరిశోధనకే పరిమితం కాకుండా, భద్రత మరియు వాణిజ్య ప్రయోజనాలపై దృష్టి సారించి, తన ఆర్కిటిక్ ప్రణాళికలను వేగవంతం చేయాలి. లేదంటే, ఈ కీలకమైన ఉత్తర ప్రాంతంలో భవిష్యత్తులో ఏర్పడే ఆర్థిక మరియు భద్రతా అవకాశాలను భారత్ కోల్పోయే ప్రమాదం ఉంది. ఆర్కిటిక్ ప్రాంతంలో తమ కార్యకలాపాలను పెంచుకోవడం ద్వారా భారతదేశం బహుముఖ ప్రయోజనాలను పొందగలదు, తద్వారా ప్రపంచ శక్తిగా దాని స్థానం మెరుగుపడుతుంది. ప్రధానంగా, ఇది వాతావరణ మార్పుల అధ్యయనం మరియు వ్యూహాత్మక ఆర్థిక మార్గాలను సురక్షితం చేయడంలో సహాయపడుతుంది. ఆర్కిటిక్ మంచు కరగడం హిమాలయాలు మరియు భారత ఉపఖండంలో రుతుపవనాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది కాబట్టి, ఆ ప్రాంతంలో విస్తృత పరిశోధనలు చేయడం భారతదేశానికి తన వాతావరణ భవిష్యత్తును అర్థం చేసుకోవడానికి చాలా అవసరం. ఆర్థికంగా, మంచు కరుగుతున్న ఉత్తర సముద్ర మార్గం (నార్తర్న్ సీ రూట్) ఐరోపా మరియు ఆసియా మధ్య దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది, ఈ కొత్త వాణిజ్య మార్గాలలో పాలుపంచుకోవడం వల్ల భారతదేశానికి రవాణా ఖర్చులు తగ్గుతాయి, తద్వారా అంతర్జాతీయ వాణిజ్యం వేగవంతం అవుతుంది. వ్యూహాత్మకంగా, ఆర్కిటిక్లో ఉన్న చమురు, సహజ వాయువు మరియు ఖనిజాలు వంటి అపారమైన వనరులపై తమ హక్కులను, ఆసక్తిని కాపాడుకోవడానికి మరియు భౌగోళిక రాజకీయ వేదికలపై పట్టు సాధించడానికి ఇది అత్యంత కీలకం.

ఆర్కిటిక్, భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక మరియు వ్యూహాత్మక భద్రతకు ఒక కీలక కేంద్రంగా మారుతుంది. ఈ ప్రాంతంలో చురుకైన ఉనికిని కలిగి ఉండటం ద్వారా, భారతదేశం తనను తాను కేవలం దక్షిణాసియా శక్తిగా కాకుండా, ప్రాంతీయ మరియు అంతర్జాతీయ సమస్యలపై కీలక అభిప్రాయం ఉన్న దేశంగా ప్రపంచానికి చాటుతుంది. ఆర్కిటిక్ కౌన్సిల్ వంటి వేదికల్లో తన పాత్రను పెంచుకోవడం ద్వారా, వనరుల వినియోగం, పర్యావరణ పరిరక్షణ మరియు రవాణా నియమ నిబంధనలను రూపొందించడంలో భారత్ తన ప్రభావం చూపే అవకాశం లభిస్తుంది. రష్యా, అమెరికా, చైనా వంటి అగ్రరాజ్యాలు పోటీ పడుతున్న ప్రాంతంలో భారతదేశం భాగస్వామ్యం కావడం భారతీయ దౌత్యానికి బలాన్నిచ్చి, ప్రపంచ స్థాయిలో దాని ప్రతిష్ఠను మరియు వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని పెంచుతుంది.

ఆర్కిటిక్లోని విస్తృత ప్రయోజనాలు తెలిసినప్పటికీ, భారతదేశం ఈ దిశగా వేగంగా పురోగమించకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా, వనరుల పరిమితులు ప్రధాన సమస్యగా ఉంది. ఆర్కిటిక్ వాతావరణంలో కార్యకలాపాలు నిర్వహించడానికి అత్యాధునికమైన, ఖరీదైన ఐస్బ్రేకర్ నౌకలు మరియు ప్రత్యేక మౌలిక సదుపాయాలు అవసరం, ఇవి భారతదేశానికి అందుబాటులో లేవు. ఆర్కిటిక్ యొక్క భౌగోళిక ప్రాధాన్యత మరియు దాని వ్యూహాత్మక అవసరాన్ని భారత్ ఆలస్యంగా గుర్తించింది, ముఖ్యంగా రక్షణ మరియు వాణిజ్య కోణంలో దీన్ని ఆలస్యంగా గుర్తించడం ఒక లోపం. ఇప్పటివరకు కేవలం శాస్త్రీయ పరిశోధనలు (హిమాద్రి కేంద్రం) మాత్రమే లక్ష్యంగా పెట్టుకోవడం, భౌగోళిక రాజకీయ పోటీపై తగినంత దృష్టి పెట్టకపోవడం మరొక కారణం. చివరికి, ఆర్కిటిక్ వ్యవహారాలకు బదులుగా, హిందూ మహాసముద్రం మరియు ఇండో-పసిఫిక్ ప్రాంతం వంటి సమీప ప్రాధాన్యత గల ప్రాంతాలపై దృష్టి పెట్టాల్సి రావడం వల్ల, ఆర్కిటిక్ వెనుకబడిపోయింది.

ఆర్కిటిక్ ప్రాంతంలో భారతదేశం తన వ్యూహాత్మక ఉనికిని విస్తరించడంలో అనేక క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోంది, వీటిని అధిగమించడం తప్పనిసరి. వీటిలో అతిపెద్ద సమస్య ఐస్బ్రేకర్ నౌకల కొరత. భారత్కు భారీగా మంచును ఛేదించగల నౌకలు లేకపోవడంతో, ఆ ప్రాంతంలో విస్తృత కార్యకలాపాలు నిర్వహించడం అసాధ్యంగా మారుతుంది. దీనికి పరిష్కారంగా, ఫిన్లాండ్, రష్యా, లేదా అమెరికా వంటి దేశాల నుండి అత్యాధునిక సాంకేతికతను బదిలీ చేసుకోవడం లేదా ఐస్బ్రేకర్ నౌకలను అద్దెకు తీసుకోవడం లేదా కొనుగోలు చేయడం వంటి మార్గాల ను భారత్ అన్వేషించాలి. మరొక ముఖ్యమైన అడ్డంకి భారీ వ్యయం. ఆర్కిటిక్ పరిశోధనలు, రవాణా మరియు మౌలిక సదుపాయాల కల్పన కోసం అధిక మొత్తంలో నిధులు అవసరమవుతాయి. ఈ అధిక వ్యయాన్ని ఎదుర్కోవ డానికి, భారత్ కేవలం ప్రభుత్వ నిధులతోనే కాకుండా, ప్రైవేట్ రంగ భాగస్వా మ్యాన్ని పెంచడం ద్వారా నిధులు సమీకరించాలి. అలాగే, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆర్థిక సహకారం పొందడం కూడా ఉపకరిస్తుంది. సాంకేతిక నైపుణ్యం లేమి మరొక ప్రధాన సవాలు. ఆర్కిటిక్ వాతావరణంలో పనిచేయడానికి అవసరమైన ప్రత్యేక నైపుణ్యం మరియు శిక్షణ పొందిన మానవ వనరుల కొరత ఉంది. ఈ సమస్యను అధిగమించడానికి, భారత్ నార్వే వంటి ఆర్కిటిక్ దేశాలతో పరిశోధన భాగస్వామ్యాలు ఏర్పరచుకోవాలి. ఈ భాగస్వామ్యాల ద్వారా శాస్త్రవేత్తలు మరియు సిబ్బందికి అవసరమైన ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చు.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఒక నిరంతర సవాలుగా ఉన్నాయి. రష్యా, అమెరికా మరియు చైనాల మధ్య ఉన్న తీవ్రమైన పోటీ వల్ల ఆ ప్రాంతంలో సురక్షితమైన ఉనికిని స్థాపించడం భారత్కు కష్టంగా మారుతోంది. ఈ సంక్లిష్టమైన వాతావరణంలో, భారతదేశం తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విధానాన్ని బలంగా ఉపయోగించి, ఏ కూటమిలో చేరకుండా, అన్ని దేశాలతో సమతుల్య దౌత్య సంబంధాలను కొనసాగించాలి. తద్వారా, అన్ని ప్రధాన శక్తుల సహకారాన్ని పొందుతూ ఆర్కిటిక్లో తన ఆసక్తిని కాపాడుకోగలదు.

ఆర్కిటిక్ ప్రాంతంలో అమెరికా మరియు ఫిన్లాండ్ల ఐస్బ్రేకర్ ఒప్పందం మరియు రష్యా-చైనాల ముందంజ నేపథ్యంలో, ఈ కీలకమైన ఉత్తర ప్రాంతంలో భారత దేశం యొక్క వ్యూహాత్మక ఉనికి ఇకపై కేవలం శాస్త్రీయ పరిశోధనలకే పరిమితం కారాదు. ఆర్కిటిక్ మంచు కరగడం వల్ల ఏర్పడుతున్న ఉత్తర సముద్ర మార్గం మరియు అపారమైన సహజ వనరులపై నియంత్రణ అనేది రాబోయే దశాబ్దాలలో ప్రపంచ ఆర్థిక మరియు భద్రతా సమీకరణాలను నిర్దేశిస్తుంది. వాతావరణ మార్పుల ప్రభావం హిమాలయాలు మరియు భారతదేశ రుతుపవ నాలపై తీవ్రంగా ఉంటుంది కాబట్టి, ఈ ప్రాంతంలో చురుకైన పాత్ర పోషించడం భారత దేశ జాతీయ ఆసక్తికి చాలా కీలకం. అయితే, ఈ విస్తరణ మార్గంలో ఐస్బ్రేకర్ నౌకల కొరత, భారీ వ్యయం మరియు సాంకేతిక నైపుణ్యం లేమి వంటి అనేక సవాళ్లు అడ్డుగా ఉన్నాయి.


ఈ అడ్డంకులను అధిగమించడానికి, భారతదేశం తన ఆర్కిటిక్ విధానాన్ని వ్యూహాత్మక-ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా మార్చుకోవాలి. ఫిన్లాండ్, రష్యా, నార్వే వంటి ఆర్కిటిక్ దేశాలతో ఐస్బ్రేకర్ సాంకేతికత మరియు నైపుణ్యం కోసం సహకార ఒప్పందాలు కుదుర్చుకోవడం, అలాగే ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని పెంచడం అత్యవసరం. కేవలం నిధులను వెచ్చించడమే కాకుండా, పటిష్టమైన మరియు వేగవంతమైన ప్రణాళికతో ముందుకు సాగాలి. ఆర్కిటిక్ ప్రాంతంలో చైనా మరియు అగ్రరాజ్యాల పోటీ తీవ్రమవుతున్న ప్రస్తుత తరుణంలో, భారతదేశం తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి నిలుపుకుంటూనే, అన్ని దేశాలతో సమతుల్య దౌత్య సంబంధాలను కొనసాగించాలి. ప్రపంచ వేదికలపై తన ప్రభావాన్ని మరింత పెంచుకోవడానికి మరియు భవిష్యత్తులో ఈ ప్రాంతంలో వనరులు, వాణిజ్య మార్గాలకు సంబంధించిన నియమ నిబంధనలను రూపొందించడంలో భాగస్వామ్యం కావడానికి, భారతదేశం తక్షణమే తన కార్యాచరణను వేగవంతం చేయాలి. ఈ ఆలస్యాన్ని అధిగమించకపోతే, భారత్ భవిష్యత్తులో కీలకమైన ఆర్థిక మరియు భద్రతా అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది.



"ఏదైనా తగినంత ముఖ్యమైనది అయినప్పుడు, అవకాశాలు మీకు అనుకూలంగా లేకపోయినా మీరు దానిని చేస్తారు."
-ఎలోన్ మస్క్



"మీరు గదిలో లేనప్పుడు ఇతరులు మీ గురించి ఏమి చెబుతారో అదే మీ బ్రాండ్."
-జెఫ్ బెజోస్



"ధర అంటే మీరు చెల్లించేది. విలువ అంటే మీరు పొందేది."
-వారెన్ బఫెట్



## హైదరాబాద్‌లో తొలి సెమీకండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియం



హైదరాబాద్ లో తెలంగాణలో భారతదేశంలో తొలి సెమీకండక్టర్ ఇన్నోవేషన్ మ్యూజియం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, క్రీడల మరియు యువతామంత్రి వాకిటీ శ్రీహరి, ఎంపీ కొండ విశ్వేశ్వర రెడ్డి, మాజీ ఐటీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య వంటి గణ్యులు హాజరయ్యారు. ఈ మ్యూజియం సెమీకండక్టర్ రంగంలో ఆధునిక సాంకేతికతను ప్రదర్శిస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోలు, భారతీయ స్వదేశీ ఏఐ చిప్, రీసైకుల్ చేయగల రాకెట్ ఇంజిన్, తదితర నెక్స్ట్-జనరేషన్ సాంకేతికతలతో కొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తోంది. ప్రతి నెలా కొత్త స్టార్టప్స్, పరిశోధనా సంస్థలు తమ సాంకేతికతలను ప్రదర్శించడానికి ప్రత్యేక 30 రోజుల ఇన్నోవేషన్ రెసిడెన్సీ మోడల్ కూడా అమలులో ఉంటుంది.బండరు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని భారతీయ సెమీకండక్టర్ వ్యూహానికి ముఖ్యమైన భాగంగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫాబ్స్, డిజైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు నైపుణ్య అభివృద్ధిలో భారీగా పెట్టుబడి వేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సెమీకండక్టర్ వ్యవస్థను మద్ధతుగా పునాదులు సిద్ధం చేస్తోంది. ఈ మ్యూజియం విద్యార్థులకు ప్రేరణగా మారి, పరిశోధనలను వాస్తవ జీవితంలో అమలు చేసే వేదికగా పనిచేస్తుందని మంత్రులు మరియు అధికారులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను సెమీకండక్టర్ పరిశ్రమకు ఒక అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యం సాధనకు ఇది మొదటి అడుగు.

## హెచ్డీఎఫ్సీ బ్యాంక్ సీనియర్ కమ్యూనిటీ వేదికకు మద్దతు



హైదరాబాద్‌లో హెచ్డీఎఫ్సీ బ్యాంక్, వాక్‌అబౌట్ అనే సీనియర్ కమ్యూనిటీ ప్లాట్‌ఫాంనకు సీడ్ ఫండింగ్ అందించడాన్ని ప్రకటించింది. వాక్‌అబౌట్, మొదట గెట్‌సెట్‌అప్ ఇండియా పేరుతో ఉండి, ముంబై, న్యూ ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో 55 ఏళ్లు పైబడిన వ్యక్తులకు కురేటెడ్ ఈవెంట్లు, అనుభవాలను అందిస్తూ, మానసికంగా, సామాజికంగా, శారీరకంగా చురుకుగా ఉండేందుకు వేదికగా ఉంటుంది. ఈ పెట్టుబడి వాక్‌అబౌట్ సేవలను మరింత విస్తరించడంలో సహాయపడనుంది.భారతదేశంలో 50 ఏళ్లు పైబడిన జనాభా 2050 నాటికి 300 మిలియన్లకు చేరుతుందని అంచనా. వాక్‌అబౌట్ ఈ పెద్ద జనాభా కోసం ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదేశాలను సృష్టించి, సామాజిక సంబంధాలు, ఆరోగ్యాన్ని పెంపొందించడంలో, జీవితకాల విద్యలో మద్దతుగా ఉంటుంది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఈ భాగస్వామ్యంతో వాక్‌అబౌట్ యొక్క డిజిటల్ మరియు ప్రత్యక్ష సేవలను మెరుగుపరచడం లక్ష్యం. దీని ద్వారా సీనియర్లు గౌరవంతో, స్వతంత్రతతో జీవితాన్ని సాగించేందుకు అవకాశాలు పెరుగుతాయని వారు నమ్ముతున్నారు.

## ఐరటెల్-హిటాచీ కలిసి సౌండ్బాక్స్ పరిష్కారం ప్రవేశపెట్టారు


ముంబైలో ఐరటెల్ పేమెంట్స్ బ్యాంక్, హిటాచీ పేమెంట్స్ సర్వీసెస్‌తో భాగస్వామ్యం ప్రకటించి, భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల అభివృద్ధికి సౌండ్బాక్స్ పరిష్కారాన్ని ప్రవేశపెట్టనుంది. ఈ సౌండ్బాక్స్ పరికరం ద్వారా వాణిజ్యదారులు భిన్న భాషల్లో చెల్లింపుల ధృవీకరణలను వినవచ్చు, అలాగే తమ ప్రమోషన్లను సులభంగా ప్రచారం చేయవచ్చు. భాగస్వామ్యం వలన డిజిటల్ చెల్లింపులు పెరుగుతూ, వాణిజ్యదారులకు సురక్షిత, నమ్మకమైన సాంకేతిక వేదిక అందించడం లక్ష్యం.ఈ పరికరం వినియోగదారులకు సులభతనం మరియు వ్యాపారులు కు సులభ, వేగవంతమైన డిజిటల్ చెల్లింపుల అనుభవాన్ని కల్పిస్తుంది. ఐరటెల్ పేమెంట్స్ బ్యాంక్ మరియు హిటాచీ పేమెంట్స్ సర్వీసెస్ కలిసి ఊరిలో మరియు పట్టణ ప్రాంతాల్లో వాణిజ్యదారులకు నూతన సాంకేతికత ద్వారా విశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారి వ్యాపారాన్ని అభివృద్ధి చేసే దిశగా ముందడుగు వేస్తున్నారు. 2024 నుండి ప్రారంభమైన ఈ సౌండ్బాక్స్ ప్రాజెక్ట్ ఇప్పుడు మరింత విస్తృతంగా అమలవుతోంది.

## సామ్‌సంగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఏఐ విప్లవానికి మార్గదర్శకుడు





గుర్గాం, 13 అక్టోబర్ 2025: సామ్‌సంగ్ భారతదేశంలో 'ఏఐ ఫర్ ఆల్' దృష్టితో ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025లో కొత్త అధ్యాయం ప్రారంభించింది. ఈవెంట్లో టాప్ ప్రభుత్వ అధికారులతో పాటు వినియోగదారులు కూడా సామ్‌సంగ్ ఏఐ ఆధారిత నూతన సాంకేతికతను ప్రత్యక్షంగా అనుభవించారు. ఐదు విభాగాల్లో సామ్‌సంగ్ తన 'ఏఐ ఫర్ ఆల్' కల్పనను ప్రదర్శించి, వ్యక్తిగత ఉత్పాదకత, స్మార్ట్ నగరాలు, జాల సంబంధాలు, విద్యా రంగంలో ఏఐ ప్రయోజనాలు, అత్యాధునిక 5జి నెట్‌వర్క్ సాంకేతికతను హైలైట్ చేసింది.సామ్‌సంగ్ ఏఐ హోం ద్వారా స్మార్ట్ ఫోన్లు, టీవీలు, వేర్‌బుల్స్, ఇతర ఉపకరణాలు సమగ్ర అనుభవాన్ని అందిస్తాయి. స్మార్ట్‌థింగ్స్ యాప్ అన్ని పరికరాలను కనెక్ట్ చేస్తూ, వినియోగదారులకు సులభతరమైన జీవనశైలిని కల్పిస్తుంది. విద్యారంగంలో కూడా ఏఐ ఆధారిత సాధనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరింత మెరుగైన నేర్చుకునే వాతావరణాన్ని అనుభవిస్తున్నారు. సామ్‌సంగ్ ఈ వేదిక ద్వారా భారతదేశంలో సాంకేతికతతో సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యాన్ని మరింత బలపరుస్తోంది.

## 50 కన్నా తక్కువ వయసులో హృద్రోగులు పెరుగుదల




టాటా ఏఐజి సర్వే ప్రకారం, 74 శాతం హృద్రోగులవారు 50 సంవత్సరాలకు తక్కువ వయసు కలవారు. 31 నుంచి 40 మధ్య వయసు గల రోగులు 36 శాతం ఉండగా, 41 నుంచి 50 మధ్య వయసు గల వారు 38 శాతం ఉంటున్నారు. ఎక్కువ మంది రోగులు ఛాతీ నొప్పిని తొలగింపుగా గుర్తించకపోవడం, ఆహారంలో అసమతుల్యత మరియు అధిక ఒత్తిడి వల్ల హృద్రోగాలు పెరుగుతున్నాయి. 60 శాతం మంది రోగులు గంభీర హృద్రోగ సమస్యలు తలెత్తాక మాత్రమే వైద్యం కోసం వెళ్తున్నారు, ఇది చికిత్సను కష్టం చేస్తుంది.అనేక మంది రోగులు ఆర్థికంగా మెరుగైన చికిత్సలకు సిద్ధంగా లేరు. 59 శాతం డాక్టర్లు తమ రోగుల్లో 40 శాతం మందికంటే తక్కువ మంది ఆర్థికంగా తగిన బీమా లేదా చికిత్సకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మహిళల హృద్రోగ సూచనలు తరచుగా మిస్సవుతుంటాయి. దేశంలో హృద్రోగం పెరుగుతున్న నేపథ్యంలో, ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవడం, సమయానుకూలమైన వైద్యం, ఆరోగ్య బీమా అవసరం అని స్పష్టం చేసింది ఈ సర్వే.

## బాటా హైదరాబాదు "బ్రైటర్ మోమెంట్స్" కార్యక్రమం



హైదరాబాద్‌లో సారత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో బాటా ఇండియా "బ్రైటర్ మోమెంట్స్" కలెక్షన్‌ను ప్రారంభించి సందడి సృష్టించింది. డిజిటల్ క్రియేటర్, నటురాలు నిహారిక ఎన్ఎమ్ ఈ కార్యక్రమానికి హెడ్లైన్‌గా హాజరై, అభిమానులతో కలిసి ఆనందించిన. ఈ కార్యక్రమంలో ఆటలు, పోటీలు, లైవ్ ఎంగేజ్‌మెంట్స్ ద్వారా ప్రేక్షకులకు సంతోషమైన క్షణాలను అందించారు ఆమె.నిహారిక మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్రజలు అద్భుతంగా స్పందించారు. బాటాతో కలిసి ఈ ఉత్సవ సీజన్ పూర్తి ఉల్లాసంగా, ఆత్మవిశ్వాసంతో నిండింది." బ్రైటర్ మోమెంట్స్ కలెక్షన్‌లో చిక్ మెటాలిక్ హీల్స్, మ్యూల్స్, లోఫర్స్ లాంటి ఫ్యాషన్ షూస్ ఉంటాయి, ఇవి అందుబాటులో ఉన్నాయి.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూల సంకేతాల నడుమ మన సూచీలు నష్టాల బాటపట్టాయి. చైనా ఉత్పత్తులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో మదుపర్లు అత్యంత అప్రమత్తత పాటించారు. దీంతో సెన్సెక్స్ 173 పాయింట్ల మేర పడిపోగా.. నిఫ్టీ 58 పాయింట్లు క్షీణించింది. ఉదయం 82,049.16 వద్ద నష్టాల్లో ప్రారంభమైన సూచీ ఒక దశలో 82,438.50 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 173.77 పాయింట్లు నష్టపోయి 82,327.05 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 58 పాయింట్లు క్షీణించి 25,227.35 వద్దకు చేరింది. రూపాయి మారకం విలువ డాలరుతో పోలిస్తే 88.66 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, హెచ్‌యూఎల్, విప్రో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో, శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు లాభపడ్డాయి.

# ఈక్విరస్-సాపియెంట్ విలీనంతో శక్తివంతమైన వెల్త్ ప్లాట్‌ఫాం

భారతదేశంలో ప్రముఖ ఆర్థిక సేవల సంస్థలైన ఈక్విరస్ గ్రూప్ మరియు సాపియెంట్ ఫిన్‌సర్వ్ గ్రూప్ కలిసి విలీనమయ్యారు. ఈ ఒప్పందం ద్వారా భారత్‌లో టాప్ 10 స్వతంత్ర వెల్త్ మేనేజర్లలో ఒకటిగా నిలిచే విధంగా ఒక గొప్ప వెల్త్ ప్లాట్‌ఫాం ఏర్పడింది. కలిపి వీరి ఆస్తుల నిర్వహణ విలువ సుమారు ₹35,000 కోట్లుగా ఉండగా, ఈ భాగస్వామ్యం దేశీయ మార్కెట్లో కీలకమైన మైలురాయిగా నిలుస్తోంది. ఈ విలీనంతో ఈక్విరస్ తన సేవా పరిధిని విస్తరించుకుంటూ, మరింత బలమైన వెల్త్ సేవలను అందించేందుకు సిద్ధంగా ఉంది.

పుణెలో ప్రధాన కార్యాలయం కలిగిన సాపియెంట్ ఫిన్‌సర్వ్ గణనీయమైన ప్రాతినిధ్యం ఉన్న సంస్థగా, మహారాష్ట్ర మరియు ఈశాన్య భారతంలో బలంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వారి వద్ద ₹13,500 కోట్ల విలువైన ఆస్తుల నిర్వహణతో పాటు నెలకు ₹65 కోట్ల ఎస్ఐపి బుక్ ఉంది, ఇది వారి స్థిరమైన వృద్ధిని సూచిస్తుంది. ఈ విలీనంలో సాపియెంట్ వ్యవస్థాపకులు మరియు సహ వ్యవస్థాపకులు ఈక్విరస్ బృందంలో చేరి సంస్థల నిర్వహణను బలపరుస్తున్నారు. ఈ భాగస్వామ్యం వల్ల కస్టమర్లకు మరింత ప్రత్యేకమైన సేవలు అందించడం సాధ్యం అవుతుంది.

ఈక్విరస్ మరియు సాపియెంట్ విలీనంతో ఏర్పడిన ప్లాట్‌ఫాం హెచ్ఎన్ఐ, యుహెచ్ఎన్ఐ, ఫ్యామిలీ ఆఫీసులు, కంపెనీలు మరియు ఫౌండర్లకు సంపదను సంరక్షించడం, పెంచడం వంటి సమగ్ర సేవలను అందిస్తుంది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా సేవల్ని రూపకల్పన చేయడం ద్వారా దీర్ఘకాలిక సంబంధాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. సాపియెంట్ ప్రత్యేకమైన సంపద నిర్వహణ విధానాలతో వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించి ఉంది, ఈక్విరస్ తమ వ్యాపార పరిజ్ఞానం ద్వారా మార్కెట్ విలువ పెంపులో ముందుంటుంది.భవిష్యత్తులో ఈ భాగస్వామ్యం వల్ల ఆస్తుల నిర్వహణ విలువను ₹50,000 కోట్ల దాకా పెంచుకోవాలని లక్ష్యం ఉంది. ప్రత్యేక రీసెర్చ్ టీమ్, వివిధ పెట్టుబడుల ఎంపికలు, ఎన్‌బీఎఫ్‌సి లైసెన్స్ ద్వారా రుణ సేవలు అందించడం ద్వారా విస్తృత సేవా పరిధిని మరింత మెరుగుపరుస్తుంది. ఈక్విరస్ గ్రూప్ గత ఏడాది వివిధ సంస్థలతో చేసిన లావాదేవీలు, తమ పటిష్ట స్థాయిలో ఉన్న బృందం వలన దేశంలో అగ్రశ్రేణి వెల్త్ మేనేజ్మెంట్ సంస్థగా ఎదగాలని కాంక్షిస్తుంది.

# క్రెడిట్ కార్డ్ ఆఫర్ల ట్రాప్‌లో పడ్డారో అంతే సంగతులు



దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ ప్రముఖ ఈ-కామర్స్ వేదికల్లో ఆఫర్ల ధమాకాలు వినిపిస్తున్నాయి. అదిరిపోయే తగ్గింపు ధరలు, భారీ రాయితీలతో సేల్స్ మొదలయ్యాయి. ఈ తరుణంలో క్రెడిట్ కార్డ్ ఉంది కదా అని ఏదిపడితే అది కొనేశారో, ఆ తర్వాత చుక్కలు కనిపించడం ఖాయం. 'నో కాస్ట్ ఈఎంఐ'పై ఇస్తున్నారు కదా అని మొత్తం క్రెడిట్ లిమిట్‌ను వాడేసి వస్తువులను కొంటే అప్పుల ఊబి తప్ప ఇంకేమీ మిగలదు. లిమిటెడ్ రేంజులో షాపింగ్ చేసినా, కొనబోయే వస్తువు ధర గురించి అన్నిచోట్లా ఆరా తీయాలి. ధరను బాగా పెంచి 'నో కాస్ట్ ఈఎంఐ'పై ఇస్తున్నారా అనే దానిపై క్లారిటీకి రావాలి. ఇంతకీ ఈ దీపావళి సీజన్‌లో క్రెడిట్ కార్డు ఆఫర్ల విషయంలో ఎలా స్పందించాలి? క్రెడిట్ కార్డును స్మార్ట్‌గా, పొదుపుగా వినియోగించడం ఎలా? సైబర్ కేటుగాళ్లు విసిరే ఫేక్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లు, ఫిషింగ్ లింక్‌ల వలలో చిక్కుకోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ కథనంలో తెలుసుకుందాం.

**క్రెడిట్ కార్డ్ ఆఫర్ ట్రాప్‌లలో పడొద్దు!**

**1. నో-కాస్ట్ ఈఎంఐ**

నో కాస్ట్ ఈఎంఐ అనేది ఒక అపోహ మాత్రమే. ఈ ఆఫర్ చూడటానికి లాభదాయకంగా కనిపిస్తుంది. నో కాస్ట్ అంటే జీరో కాస్ట్ అని మనం భావిస్తాం. వాస్తవానికి ఇలాంటి ఆఫర్‌తో విక్రయించే వస్తువుల ధరలను అప్పటికే పెంచుతారు. ప్రాసెసింగ్ ఫీజును కూడా వస్తువు ధరలోనే కలుపుతారు. చివరకు ఇదే వస్తువును 'నో కాస్ట్ ఈఎంఐ'పై ఇస్తామని ప్రకటిస్తారు. ఈ ఆఫర్ ద్వారా మనం కొనే వస్తువుకు సంబంధించిన ఈఎంఐలను కొన్ని నెలల పాటు చెల్లించాలి. ఈ అప్పు తీరే వరకు మన నెలవారీ ఆదాయంపై గణనీయంగా భారం పెరుగుతుంది. ఒకవేళ ఏదైనా ఈఎంఐ మిస్ అయితే భారీగా వడ్డీని వడ్డిస్తారు.

**2. క్రెడిట్ లిమిట్**

కొందరి వద్ద ఒకే క్రెడిట్ కార్డు ఉంటుంది. పలువురి వద్ద ఒకటికి మించి క్రెడిట్ కార్డులు ఉంటాయి. ఎక్కువ కార్డులున్న వారు, ఒకే కార్డుతో మొత్తం ఆన్‌లైన్ షాపింగ్ చేయకూడదు. ఒక్కో కార్డుతో ఒక్కో షాపింగ్ ఖర్చును చెల్లించాలి. తద్వారా అన్ని కార్డులలో క్రెడిట్ లిమిట్ వినియోగ నిష్పత్తి సముచితమైన నిష్పత్తిలో ఉంటుంది. కార్డులోని క్రెడిట్ లిమిట్‌లో 40 శాతానికి మించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఖర్చు చేయకండి. ఒకవేళ అంతకుమించి ఖర్చు చేస్తే క్రెడిట్ స్కోర్ డౌన్ అవుతుంది. మీ అప్పులు భారీగా పెరిగిపోయినా క్రెడిట్ స్కోర్ ప్రతికూలంగా ప్రభావితం అవుతుంది. భవిష్యత్తులో అప్పులు దొరకడం కష్టతరం అవుతుంది.

**3. చక్రవడ్డీ, రీపేమెంట్‌లో జాప్యం**

క్రెడిట్ కార్డు ద్వారా ఖర్చులు చేశాక, ప్రతినెలా సకాలంలో ఈఎంఐ చెల్లించాలి. లేదంటే బ్యాంకులు సగటున 30 నుంచి 45 శాతం దాకా వార్షిక వడ్డీతో పాటు లేట్ ఫీజును విధిస్తాయి. ఈ నెగెటివ్ అంశాలన్నీ మన సిబిల్ రిపోర్టులో దాదాపు ఏడేళ్ల పాటు నమోదై ఉంటాయి. అందుకే క్రెడిట్ కార్డుకు సంబంధించిన 'మినిమం అమౌంట్' కంటే 'ఫుల్ అమౌంట్'ను చెల్లించడానికే ప్రయారిటీ ఇవ్వండి. ఫలితంగా మీ క్రెడిట్ స్కోరు మెరుగుపడుతుంది. క్రెడిట్ ప్రొఫైల్ ఆరోగ్యవంతంగా కనిపిస్తుంది.

**4. నగదు విత్‌డ్రాల దుర్వినియోగం**

కొంతమంది క్రెడిట్ కార్డుల నుంచి నగదును విత్‌డ్రా చేస్తుంటారు. ఈ విధంగా డ్రా చేసే డబ్బులపై సత్వరం భారీ వడ్డీతో పాటు 2 నుంచి 3 శాతం లావాదేవీ ఫీజును బ్యాంకు విధిస్తుంది. అత్యవసరాల్లో మాత్రమే క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు విత్‌డ్రా చేయాలి. షాపింగ్ కోసం ఈ పని చేయడం కరెక్ట్ కాదు.

**5. ఫేక్ రిబేట్లు, ఫ్లాష్ డీల్స్**

పలు ఈ-కామర్స్ వేదికలు ముందుగా కొన్ని వస్తువుల ధరలను పెంచుతాయి. అనంతరం అవే వస్తువులపై డిస్కౌంట్లను ప్రకటిస్తాయి. ఫ్లాష్ డీల్స్ పేరుతో అట్టహాసపు ప్రచారానికి తెర తీస్తాయి. మనం నిజమే అనుకొని, ఆ వస్తువులను కొనేస్తాం. ఇలాంటి ఆఫర్లను చూసినప్పుడు, ఆ వస్తువుల ధరల సమాచారాన్ని ఇతర ఈ-కామర్స్ వేదికల్లోనూ చెక్ చేయాలి. వాస్తవిక ధరపైనే డిస్కౌంట్ ఇచ్చారా? ధరను పెంచి డిస్కౌంట్ ఇచ్చారా? అనే దానిపై స్పష్టతకు రావాలి. ఆ తర్వాతే వస్తువు కోసం ఆర్డర్ ఇవ్వాలి. ఎమోషన్‌తో వస్తువులను ఎగబడి కొనకూడదు. క్రెడిట్ కార్డు అంటే స్వల్పకాలిక రుణం. అందులో ఉన్న క్రెడిట్ లిమిట్ అనేది ఉచితంగా వచ్చిన డబ్బులేం కాదు. అందుకే ప్రతీ పైసాను ఆచితూచి ఖర్చు చేయాలి.

ఫేక్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లను ఇలా గుర్తించండి

పండుగ సీజన్లలో జనానికి కుచ్చుటోపీ పెట్టడానికి సైబర్ కేటుగాళ్లు ఫేక్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లను తయారు చేయిస్తారు. ఇవి తప్పుడు స్పెల్లింగ్‌లతో ఉంటాయి. ఉదాహరణకు అమెజాన్ ఫేక్ వెబ్‌సైట్‌ను amaz0n-sale.com అనేలా, ఫ్లిప్‌కార్ట్ ఫేక్ వెబ్‌సైట్‌ను flipk0rt-sale.com అనేలా తయారు చేస్తారు. అందుకే మనం ఏదైనా ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లోకి వెళితే, దాని వెబ్ అడ్రస్‌లో ఉన్న స్పెల్లింగ్‌ను తప్పకుండా తనిఖీ చేయాలి. ఫేక్ ఈ-కామర్స్ వెబ్‌సైట్ల అడ్రస్ ముందు భాగంలో 'https://' అనేది ఉండదు. వీటికి 'ప్యాడ్ లాక్' గుర్తు కూడా ఉండదు.


సైబర్ కేటుగాళ్లు లాగిన్ కావాలంటూ, పేమెంట్ చేయాలంటూ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు, ఈమెయిల్స్ పంపుతారు.

ఫేక్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లలోనూ వస్తువుల ధరలు వాస్తవిక రేంజులోనే ఉంటాయి. ప్రజలను నమ్మించడానికి అక్కడ సరైన రేట్లనే డిస్‌ప్లే చేస్తారు. ఫేక్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో రాసే పదాలు, వాక్యాలలో ఇంగ్లిష్ గ్రామర్ దోషాలు ఉంటాయి. రివ్యూ ఫేక్‌వి ఉంటాయి. వస్తువులను విక్రయించే వారి కాంటాక్ట్ సమాచారం ఉండదు. సైబర్ కేటుగాళ్లు కేవలం ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేయమంటారు. క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్‌ను ఇవ్వరు.

మీ ఈ-కామర్స్ ఖాతా సస్పెండ్ అయింది. మీ ఈ-కామర్స్ ఆర్డర్‌ను వేరిఫై చేయండి అంటూ వెంటవెంటనే మెసేజ్‌లు పంపుతారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, డెబిట్, క్రెడిట్ కార్డుల సమాచారాన్ని అడుగుతారు.

# టోల్ గేట్లకు ఇక రాం రాం..

### జియో పేమెంట్స్ బ్యాంక్‌తో అంతా కామ్!



భారతదేశ డిజిటల్ పేమెంట్స్ రంగంలో ఇది మరో రకమైన మైలురాయి. ఫలితంగా రాబోయే ఐదు సంవత్సరాలలో జాతీయ రహదారులపై 'అడ్డంకులు లేని' టోల్ వసూళ్ల వ్యవస్థ సాకారమయ్యేందుకు ఇది ఇంకో ముందడుగు. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ సబ్సిడియరీ సంస్థ అయిన జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ ఈ తరహా కాంట్రాక్ట్ మరోసారి దక్కించుకుంది. 'గురుగ్రామ్(హర్యానా)-జైపూర్(రాజస్థాన్)' మధ్య ఉన్న రెండు టోల్ ప్లాజాల్లో ఫాస్టాగ్ ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ ఆధారిత మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో ) టోల్ కలెక్షన్ వ్యవస్థను అమలు చేయడానికి జేపీబీఎల్ కాంట్రాక్ట్ గెలిచింది.

**ఏమిటీ సరికొత్త టోల్ వ్యవస్థ?**

రహదారులపై ప్రయాణించేప్పుడు టోల్ గేట్ల దగ్గర వాహనదారులను ఆపి, టోల్ వసూలు చేయడం మనం ఇప్పటివరకూ చేస్తున్నాం. ఈ టోల్ వసూలు చేసేందుకు రోడ్లకు అడ్డంగా పెద్దఎత్తున టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసి, అక్కడ టోల్ వసూలు కోసం సిబ్బందిని పెట్టి పని పూర్తి చేసేవారు. అయితే, ఇక మీదట ఇలాంటి వ్యవస్థకు కాలం చెల్లిపోబోతోంది. ఎలాగంటే.. రోడ్ల మీద టోల్ ప్లాజాలు ఉండవు. ఆయా నిర్ణీత ప్రదేశాల్లో రహదారులపైన కెమెరాలతో కూడిన ప్రత్యేక స్ట్రక్చర్లు ఏర్పాటు చేస్తారు. ఇవి వాహనాల నెంబరు ప్లేట్లను గుర్తించి ఆటోమేటిక్ గా టోల్ వాటికవే వసూలు చేసుకుని ఖాతాలో జమ చేసుకుంటాయి. దీని వల్ల వాహన దారులు రోడ్ల మీద ఆగాల్సిన పని ఉండదు. ఈ కొత్త విధానం వల్ల ప్రయాణ సమయం, ఇంధనం, ఖర్చులు బాగా ఆదా అవుతాయి. పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది. టోల్ ప్లాజాల దగ్గర పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోవాల్సిన పరిస్థితులు ఉండవు. హైవేల మీద ఈ తరహా టోల్ వసూలు సేవలందించేందుకు ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ జారీ చేసిన ఒక టెండర్‌ను సోమవారం జియో పేమెంట్స్ బ్యాంక్ దక్కించుకుంది. ఈ ఆధారిత మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లోవ్యవస్థ ఆధునిక ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ టెక్నాలజీగా పనిచేస్తుంది. రేడియో-ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ , డెడికేటెడ్ షార్ట్-రేంజ్ కమ్యూనికేషన్ ), గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ) వంటి టెక్నాలజీలతో ఈ సిస్టమ్ పనిచేస్తుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 11 టోల్ ప్లాజాల్లో ఈ తరహా టోల్ ఆపరేషన్స్‌ను మేనేజ్ చేస్తున్న జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ కు ఇది ఐదో బిడ్.

ఈ కాంట్రాక్ట్‌తో భారతదేశ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో డిజిటల్ పేమెంట్స్ భవిష్యత్తును రూపొందించడంలో జియో పేమెంట్స్ బ్యాంక్ ముఖ్య పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదించిన కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీగా జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ ఈ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ తాజా డెవలప్మెంట్ భారతీయ రోడ్డు రవాణా వ్యవస్థను మరింత స్మూత్‌గా మార్చడంలో కీలకమైందని చెప్పవచ్చు.

## బంగారం, వెండిలో పెట్టుబడి అవకాశం.. కోటక్ నుంచి గోల్డ్, సిల్వర్ ఫండ్



కోటక్ మహీంద్రా ఏఎంసీ కొత్తగా గోల్డ్ సిల్వర్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) అక్టోబర్ 20తో ముగుస్తుంది. కనీసం రూ. 100 నుంచి ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇది ప్రధానంగా కోటక్ గోల్డ్ ఈటీఎఫ్ , కోటక్ సిల్వర్ ఈటీఎఫ్ యూనిట్లలో ఇన్వెస్ట్ చేస్తుంది.బంగారం, వెండిలో పెట్టుబడి అవకాశాన్ని కల్పిస్తూ, దీర్ఘకాలికంగా మూలధన వృద్ధి ప్రయోజనాలను అందించడం ఈ ఫండ్ లక్ష్యమని సంస్థ ఎండీ నీలేష్ షా తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు బంగారం నిల్వలను పెంచుకుంటున్నాయని, పరిశ్రమల్లో వెండి వాడకం పెరుగుతోందని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో రెండింటి వృద్ధి ప్రయోజనాలను పొందేందుకు ఈ ఫండ్ అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.

**ఇన్వెస్కో ఇండియా కన్జంప్షన్ ఫండ్**

దేశీయంగా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇండియా కన్జంప్షన్ ఫండ్‌ని ప్రవేశపెట్టింది ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్. ఈ ఫండ్ అక్టోబర్ 17 వరకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. రోజువారీ సిప్ రూపంలో అయితే కనీసం రూ. 100, నెలవారీ అయితే రూ. 500 నుంచి పెట్టుబడులు పెట్టొచ్చు.వినియోగం థీమ్‌తో ప్రయోజనం పొందే కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ సంబంధ సాధనాల్లో కనీసం 80% ఇన్వెస్ట్ చేస్తుంది. మనీష్ బొద్దార్, అమిత్ గణాత్రా ఫండ్ మేనేజర్లుగా ఉంటారు. .

## టైమ్ హార్టన్స్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 41వ షాప్




హైదరాబాద్ రాయ్‌జీవి గాంధీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ ఎరైవల్స్ ప్రాంతంలో టైమ్ హార్టన్స్ 41వ షాప్‌ను ప్రారంభించింది. ఇది హైదరాబాద్‌లో మూడవ స్టోర్‌గా, ప్రయాణికులు, విమాన సిబ్బంది కోసం 24 గంటలు సేవలందిస్తుంది. తాజా కాఫీ, ప్రత్యేకమైన బేక్డ్ ఐటమ్స్ అందుబాటులో ఉంటాయి.టైమ్ హార్టన్స్ 2022 నుండి భారతదేశంలోని ప్రధాన నగరాల్లో దూకుడుగా విస్తరిస్తోంది. ఈ కొత్త ఎరైవల్స్ స్టోర్‌తో మొత్తం ఏడుగురు విమానాశ్రయాలలో ఉన్న షాపులు భారతీయ ప్రయాణికులకు మరింత సౌకర్యాన్ని అందిస్తాయి. సంస్థ భవిష్యత్తులో మరిన్ని నగరాల్లో విస్తరణ చేయాలని ఉద్దేశ్యంతో ఉంది.

## భారతదేశంలో కొత్త హృద్రోగ మందు ప్రారంభం




బ్రిస్టోల్ మైయర్స్ స్క్విబ్ భారతదేశంలో కొత్త మందు కోపోజ్యో® (మవాకమ్టెన్) ను విడుదల చేసింది. ఇది అడ్డంకి కలిగించే హైపర్ట్రోఫిక్ కార్డియోమయోపతి (ఓహెచ్‌సిఎం) ఉన్న వయోజనులకు అందుబాటులో ఉండే మొదటి మరియు ఒకేఒక్క ఔషధం. ఈ మందు హృదయంలో సమస్యల మూలకారణాన్ని లక్ష్యం చేస్తూ, వ్యాధి లక్షణాలను తగ్గిస్తుంది.ఓహెచ్‌సిఎం అనేది తరచుగా వారసత్వంగా వస్తుంది మరియు దుమ్ము, తలనొప్పి, అలసట వంటి సమస్యలను కలిగిస్తుంది. భారత్‌లో సుమారు 2.8 మిలియన్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు, కానీ ఎక్కువ మంది నిర్ధారణ పొందలేదు. ఇప్పటి వరకు బీటా బ్లాకర్స్, కాల్షియం ఛానల్ బ్లాకర్స్ వంటి మందులు లక్షణాలను తగ్గిస్తాయి కానీ వ్యాధి మూలాన్ని చికిత్స చేయలేవు.కాపోజ్యో® మందు ఫేజ్ 3 ప్రయోగాలలో మంచి ఫలితాలు చూపింది. ఇది ఆసుపత్రిలో చేసే శస్త్రచికిత్సలకు ప్రత్యామ్నాయంగా, సులభంగా తీసుకునే మందుగా అందుబాటులో ఉంది. బ్రిస్టోల్ మైయర్స్ స్క్విబ్ ఈ మందుతో భారతదేశంలో హృద్రోగ చికిత్సలో కొత్త దశను ప్రారంభించింది.

## జియోహాట్‌స్టార్ కొత్త ఫ్యాషన్ వ్యాపార షో ప్రారంభం




జియోహాట్‌స్టార్ "పిచ్ టు గెట్ రిచ్" అనే భారతదేశంలో తొలి ఫ్యాషన్-ఆధారిత వ్యాపార రియాలిటీ షోను ముంబైలో ఘనంగా ప్రారంభించింది. అక్షయ్ కుమార్, కరణ్ జోహార్, మణీష్ మల్హోత్రా, మలైకా అరోరా లాంటి బాలీవుడ్ ప్రముఖులు ఈ షో ట్రైలర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 40 కోట్ల రూపాయల పెట్టుబడితో యువ ఫ్యాషన్ స్టార్టప్‌లకు అవకాశం ఇవ్వబడుతుంది.షోలో భాగంగా 14 ఫ్యాషన్ బ్రాండ్లు రన్‌వే షోతో తమ సృష్టిని ప్రదర్శించాయి. ఈ షో ఫ్యాషన్, సృజనాత్మకత, వ్యాపారాన్ని కలిపి కొత్త తరానికి స్ఫూర్తినిస్తూ, భారత యువతకు తమ ప్రతిభ చూపుకునేందుకు వేదికగా నిలుస్తుంది. జియోహాట్‌స్టార్ ద్వారా అక్టోబర్ 20 నుండి ప్రత్యేకంగా ప్రసారం అవుతుంది.ఈ కార్యక్రమంలో బాలీవుడ్ తారలు, ప్రముఖ వ్యాపారవేత్తలు న్యాయమూర్తులుగా వ్యవహరిస్తూ యువ ఫ్యాషన్ వ్యాపారుల ప్రతిపాదనలను పరిశీలిస్తారు. ఇది "మెక్స్ ఇన్ ఇండియా" భావనను ముందుకు తీసుకువెళ్లి, దేశంలో కొత్త ఫ్యాషన్ బ్రాండ్లను ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు దోహదపడుతుంది.

# ఏఐ ఆధారిత స్టింక్ ప్రో ప్రారంభం



హైదరాబాద్‌లోని టి-హబ్ లో నిర్వహించిన కార్యక్రమంలో, భారత్‌లో తొలిసారిగా ఏఐ ఆధారిత మానవ పనితీరు మరియు ఆరోగ్య అభివృద్ధి వేదిక అయిన స్టింక్ ప్రో ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పుల్లెల గోపిచంద్, జయేశ్ రంజన్ మరియు రిలయన్స్ జియో ప్రధాన డేటా శాస్త్రవేత్త డాక్టర్ శైలేష్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం "రీథింకింగ్ లెర్నింగ్, రీఇమాజినింగ్ ఇండియా'స్ ఫ్యూచర్ విత్ ఏఐ" అనే థీమ్‌తో సాగింది.స్టింక్ ప్రో వేదిక విద్యార్థుల మరియు అథ్లెట్ల సంపూర్ణ అభివృద్ధికి లక్ష్యంగా సోమచేతన, ఆహారపు జ్ఞానం మరియు శారీరక నైపుణ్యాలను ఏఐ తో సమ్మిళితం చేస్తుంది. ఇందులో ఏఐ ఆధారిత మెదడు పనితీరు విశ్లేషణ, వ్యక్తిగత ఆహార ప్రణాళికలు, మరియు గాయ నివారణతో కూడిన శారీరక అంచనాలు ఉంటాయి. ఇది మానవ సామర్థ్యాన్ని గణాంకాల ఆధారంగా అర్థం చేసుకొని, ఉపాధ్యాయులు, కోచ్‌లు, తల్లిదండ్రులకు అనుకూల నిర్ణయాలు తీసుకునేలా చేయగలదు.ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని 14 ఉత్తమ పాఠశాలలను "బెస్ట్ స్పోర్ట్స్ ఇంప్లిమెంటేషన్ అవార్డు" తో సత్కరించారు. ఈ పాఠశాలలు క్రీడలు, ఆరోగ్యం మరియు కొత్త ఆవిష్కరణలను విద్యా విధానంలో సమర్థవంతంగా నిమగ్నం చేశాయి. స్టింక్ ప్రో దృష్టి భారత విద్యా వ్యవస్థలో ఏఐ ఆధారిత ఆరోగ్యం మరియు పనితీరుకి స్థిర స్థానం కల్పించడం.

## రూ.6 వేలకే 5జీ స్మార్ట్‌ఫోన్. దిమ్మతిరిగే ఫీచర్లు!

### ఈ దీపావళి అమెజాన్ లో లావా కంపెనీ ఆఫర్




దీపావళి పండుగ సందర్భంగా అమెజాన్ ఫెస్టివల్ ఆఫర్ కింద స్మార్ట్‌ఫోన్‌పై బెస్ట్ డీల్స్‌ను అందిస్తోంది. తక్కువ బడ్జెట్‌లో 5జీ స్మార్ట్‌ఫోన్ తీసుకోవాలని అనుకునే వారి కోసం ఈ మొబైల్ అని చెప్పవచ్చు. అయితే ఈ ఆఫర్లు కొన్ని రోజులు మాత్రమే. ప్రస్తుతం అమెజాన్‌లో గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ దివాళి స్పెషల్ సేల్ నడుస్తోంది. ఈ సేల్ పూర్తి అయ్యేలోగా ఈ మొబైల్ కొనుక్కోవచ్చు. అయితే ఈ ఆఫర్‌లో మీరు 4 కె కెమెరా ఉన్న 5 జి స్మార్ట్ ఫోన్‌ను కేవలం రూ.6 వేలకే కొనుగోలు చేయవచ్చు. మరి అదిరిపోయే ఈ ఫీచర్లతో ఉన్న ఆ 5జీ స్మార్ట్‌ఫోన్ ఏంటో ఈ స్టోరీలో చూద్దాం. డ్యూయల్ రియర్ కెమెరా...:లావా కంపెనీ లావా బోల్డ్ ఎన్ 1 5 జి స్మార్ట్ ఫోన్ ఈ దీపావళి అమెజాన్ ఆఫర్‌లో వస్తుంది. ఈ ఫోన్ ధర ఆఫర్‌లో మీకు రూ.6,999లకు లభిస్తుంది. అదే మీరు అమెజాన్ సేల్ నుంచి హెచ్ డిఎఫ్ సి బ్యాంక్ డెబిట్, డెబిట్ కార్డ్ ఈ ఎంఐ ఆప్షన్ తో తీసుకుంటే మీకు రూ.699 ఎక్స్‌ట్రా డిస్కౌంట్ కూడా లభిస్తుంది. దీంతో మీకు అన్ని ఆఫర్లు పోయి రూ.6,300లకు లభిస్తుంది. ఈ లావా బోల్డ్ ఎన్1 స్మార్ట్ ఫోన్‌కు 4 కె వీడియో రికార్డింగ్ సపోర్ట్ ఉంది. అలాగే దీనికి డ్యూయల్ రియర్ కెమెరా కూడా ఉంది. ఈ మొబైల్‌కి 13 ఎంపి మెయిన్ కెమెరా, ముందు 5 ఎంపి సెల్ఫీ కెమెరా ఉంటుంది. దీనికి 5జీ చిప్ సెట్ కూడా ఉంది. ఇందులో 4 జీబీ ఫిజికల్ ర్యామ్‌తో పాటు 4జీబీ వర్చువల్ ర్యామ్ కూడా ఉంది. దీనికి 64 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ కూడా ఉంది. ఈ లావా బడ్జెట్ 5జి స్మార్ట్ ఫోన్ హెచ్ డి ం రిజల్యూషన్ కలిగిన 6.75 ఇంచ్ స్క్రీన్ ఉంది. ఈ స్క్రీన్ 90హెచ్ జెడ్ రిఫ్రెష్ రేట్, మంచి బ్రైట్నెస్ కూడా ఉంది. ఈ ఫోన్ 5000 ఎం ఏ మెచ్ బిగ్ బ్యాటరీ, ఫాస్ట్ ఛార్జ్ సపోర్ట్ కూడా దీనికి ఉంది. ఈ ఫోన్ ఐపి 54 రేటింగ్ తో డస్ట్ అండ్ వాటర్ స్ప్లాష్ రెసిస్టెన్స్ ఉండటం వల్ల బాగా పనిచేస్తుంది. ఈ లావా స్మార్ట్ ఫోన్ ఫేస్ అన్లాక్, సైడ్ ఫింగర్ ప్రింట్ సెన్సార్ కూడా కలిగి ఉంటుంది. ఈ ఫోన్ బ్లూ, గోల్డ్ రెండు కలర్‌లో ఈ మొబైల్ ఉంది.ఇక దీపావళికి తక్కువ ధరలో 5జీ ఫోన్ కొనాలనుకుంటే ఇది బెస్ట్ చాన్స్!రూ.6,300కే లభించే లావా బ్లేజ్ ఎన్1 ఫోన్ 4 కె రికార్డింగ్, 5జి చిప్‌సెట్ వంటి హై ఎండ్ ఫీచర్లతో వస్తోంది.6.75 ఇంచుల హెచ్‌డిం స్క్రీన్, 5000ఎమ్ఏహెచ్ బ్యాటరీ, డ్యూయల్ కెమెరాలతో పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్.అమెజాన్‌లో లిమిటెడ్ టైం ఆఫర్ కింద అందుబాటులో ఉన్న ఈ డీల్ మిస్ అవ్వకండి!

# ఇంటెన్స్ యాక్షన్ మూవీ "తక్షకుడు"

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఆనంద్ దేవర కొండ ప్రముఖ ఓటీటీ నెట్ ఫ్లిక్స్ కోసం చేసిన సినిమా "తక్షకుడు". ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో దర్శకుడు వినోద్ అనంతోజు ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆనంద్ దేవర కొండ, వినోద్ అనంతోజు కాంబోలో వచ్చిన "మిడిల్ క్లాస్ మెలో డీస్" సినిమా ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో "తక్షకుడు" సినిమా మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షి స్తోంది. ఈ చిత్రాన్ని నాగవంశీ. ఎస్, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. "తక్షకుడు" సినిమాలో నితాన్షీ గోయెల్ నాయికగా నటి స్తోంది. త్వరలోనే ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్ చేస్తున్నట్లు నెట్ ఫ్లిక్స్ అనౌన్స్ చేసింది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ లో 'వేటగాడి చరిత్రలో జింకపిల్లలే నేరస్థులు..' అనే ట్యాగ్ లైన్ ఆకట్టుకుంటోంది. హీరో ఆనంద్ దేవరకొండ చేతిలో తుపాకీ పట్టుకుని ఉండటం, ఒక ఊరు అగ్నికి ఆహుతి అవుతున్నట్లు డిజైన్ చేసిన పోస్టర్ ఆసక్తి కలిగిస్తోంది. ఆనంద్ దేవరకొండ కెరీర్‌లో ఇదొక డిఫరెంట్ అటెంప్ట్ కానుందనే అంచ నాలు ఏర్పడుతున్నాయి.



# సందీప్ కిషన్ కొత్త ప్రాజెక్ట్ సూపర్ సుబ్బు సిరీస్



సందీప్ కిషన్ హీరోగా రూపొందిన కొత్త ప్రాజెక్ట్ సూపర్ సుబ్బు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ 2026లో స్ట్రీమింగ్ కానుంది. దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ.. "సూపర్ సుబ్బు" ఆలోచన ఒక అబ్జర్వేషన్ నుంచి పుట్టింది. ఈ రోజుకీ 'సెక్స్ ఎడ్యుకేషన్' గురించి మనం ఇంకా గుసగుసలలోనే మాట్లాడుతున్నాం. తల్లిదండ్రులు దాన్ని దాటవేస్తారు, పాఠశాలలు విస్మరిస్తాయి, పిల్లలు అపోహలతో పెరుగుతారు. ఆ మౌనాన్ని ఒక కథగా మార్చాలని అనిపించింది. సుబ్రహ్మణ్యం అనే పాత్ర ద్వారా అవగాహనను ఎలా కలుస్తుందో చూపించాలనుకున్నాం. మాఖీపూర్ ప్రజల , అపోహలు, ఆప్యాయత.. ఇవన్నీ మనందరికీ తెలిసిన గ్రామజీవనాన్ని గుర్తు చేస్తాయి. నటి మిథిలా పాల్కర్ మాట్లాడుతూ.. సూపర్ సుబ్బు కామెడీ, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు అన్నీ కలగలసిన కథ. సుబ్బు అనే దురదృష్టపు యువకుడు చిన్న పట్టణ వాస్తవాలతో, కఠినమైన తండ్రితో ఎలా పోరాడతాడో ఈ సిరీస్ చెబుతుంది. అతని ప్రయాణం ఒక గ్రామీణ నేపథ్యానికి చేరుతుంది, అక్కడ అతను అరుదుగా మాట్లాడే ఒక విషయాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. ప్రేమ, ఆకాంక్షతో కూడిన ఈ కథ కొత్తదనం, హాస్యంతో నిండినదిగా ఉంటుంది. పాత్రలు చాలా దగ్గరగా అనిపిస్తాయి, కథ కూడా ఎంతో వైవిధ్యంగా ఉంటుంది. ఇది నేను ఇప్పటివరకు చేసిన ప్రాజెక్టుల కంటే పూర్తిగా భిన్నమైనది. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ..ఇప్పుడు మనం ఒక అందమైన కథా కాలంలో ఉన్నాం. కథలు మరింత ధైర్యంగా, భావోద్వేగంగా, మన జీవితాల్లో భాగంగా అనిపించేలా మారాయి. 'సూపర్ సుబ్బు' కథ విన్న వెంటనే ఇది చెప్పదగ్గ నిజమైన కథ అని నమ్మాను. ప్రేక్షకులు ఈ కథను ప్రేమిస్తారని అనిపించింది. పాత్రల ఉత్సాహం, రచనలోని హాస్యం..ఇవన్నీ సిరీస్ మొత్తాన్ని చిరునవ్వుతో నింపుతాయి.

# "కె-ర్యాంప్"లో ఫన్ ఎంటర్ టైన్ మెంట్ కు లోటు ఉండదు,- డైరెక్టర్ జైన్స్ నాని

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "కె-ర్యాంప్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. "కె-ర్యాంప్" సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో ఈ సినిమాలోని హైలైట్స్ తెలిపారు దర్శకుడు జైన్స్ నాని. "కె-ర్యాంప్" అనే టైటిల్ ఈ కథకు సరిపోతుందనే పెట్టాం. బూతు పదం అని ఆలోచించలేదు. ఈ చిత్రంలో హీరో క్యారెక్టర్ పేరు కుమార్. కథానుసారం అతని క్యారెక్టర్ ఇబ్బందుల్లో పడుతుంది. ర్యాంప్ అనే మాట మనందరికీ తెలుసు. అలా కథకు, హీరో క్యారెక్టరైజేషన్ కు సరిపోయేలా "కె-ర్యాంప్" అని పెట్టాం. ముందు వేరే టైటిల్స్ అనుకున్నా, ఇదే క్యాచీగా ఉంది, త్వరగా ప్రేక్షకుల్లోకి వెళ్తుందని అనిపించింది. "కె-ర్యాంప్" సినిమా ట్రైలర్ చూసి ఒకట్రెండు మాటలు ఇబ్బందిగా ఉన్నాయని అనుకోవద్దు. ఇది పక్కాగా ఫ్యామిలీస్ చూడాల్సిన సినిమా. ఏ సినిమాకైనా ముందు యూత్ ఆడి యెన్స్‌ను అట్రాక్ట్ చేయాలని ప్రయత్నిస్తాం. ఆ ప్రయత్నంలో భాగంగానే ట్రైలర్ కట్ చేశాం. యూత్ ఆడియెన్స్ కు నచ్చితే వాళ్లే ఫ్యామిలీ ఆడియెన్స్ ను తీసుకొస్తారు. ప్రతి ఆడియెన్ రిలేట్ అయ్యేలా ఈ స్టోరీ ఉంటుంది. పేరెంట్స్ ఈ సినిమా చూడాలి. కొన్ని సినిమాల్లో మూవ్ మెంట్స్ మాత్రమే ఉం టాయి, కానీ "K-ర్యాంప్"లో మంచి కథ ఉంది. దాంతో పాటే మూవ్ మెంట్స్ డిజైన్ చేశాం. ఇంటర్వెల్ బ్లాక్ సర్ ప్రైజ్ చేస్తుంది.



నేను మద్రాస్ ఐఐటీలో చదువుకున్నా. అక్కడ ఉన్నప్పుడే షార్ట్ ఫిలింస్ చేశాను. అవి బాగున్నాయని పేరొచ్చింది. వాటితో వచ్చిన కాన్ఫిడెన్స్ తో టాలీవుడ్‌కు వచ్చాను. అయితే సినిమాలంటే చిన్నప్పటి నుంచే ప్యాషన్ ఉండేది. కిరణ్ అబ్బవరంతో ఏడాదిన్నర ట్రావెల్ చేశాను. కథ ఓకే అయ్యాక ఆయన బాడీ లాంగ్వేజ్, ఎనర్జీని బట్టి స్క్రిప్ట్ లో బెటర్ మెంట్స్ చేసుకున్నాం. స్క్రిప్ట్ స్టేజీలో తనకు అనిపించింది కిరణ్ షేర్ చేసుకునేవారు అంతేగానీ ఆయన కథ, స్క్రిప్ట్ విషయంలో ఎక్కడా జోక్యం చేసుకోలేదు. ఎక్కడా వేస్టేజ్ లేకుండా అనుకున్నది అనుకున్నట్లుగా 47 డేస్ లో షూటింగ్ చేశాం.హీరోయిన్ క్యారెక్టర్ కోసం యుక్తిని అనుకున్న తర్వాత వర్క్ షాప్ చేయించాం. సినిమాలోని కీ సీన్స్ అన్నీ రిహార్సల్స్ చేసి పక్కాగా షూటింగ్ కు వెళ్లాం. ఈ చిత్రంలోని పాత్రకు యుక్తి పర్ఫెక్ట్ గా సెట్ అయ్యింది. హీరో హీరోయిన్స్ క్యారెక్టర్స్ కు పర్ ఫార్మెన్స్ పరంగా చాలా స్కోప్ ఉన్న కథ ఇది. కిరణ్ గారికి, యుక్తికి మంచి పేరొస్తుంది. హీరో హీరోయిన్ క్యారెక్టరైజేషన్స్ ఫాలో అయితే మూవీని ఆద్యంతం ఎంజాయ్ చేస్తారు. ఫస్టాఫ్ లో హీరో క్యారెక్టర్ , సెకండాఫ్ లో హీరోయిన్ క్యారెక్టర్ ఎంటర్ టైన్ చేస్తుంది.

# 'డ్యూడ్' లో చేసిన కురల్ క్యారెక్టర్ ఛాలెజింగ్‌గా అనిపించింది - మమిత బైజు

లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్‌తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ట్రైలర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మమిత బైజు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ప్రేమలు రిలీజ్ తర్వాత మేకర్స్ నన్ను సంప్రదించారు. ఆ తర్వాత డైరెక్టర్ తో మీటింగ్ జరిగింది. కీర్తి తొలిసారిగా నన్ను సంప్రదించినప్పుడు, కథను చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. కాన్సెప్ట్ కూడా చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఆ కథలో నా పాత్రకు చాలా ప్రాధాన్యం వుంది. కురల్ పాత్రలో చాలా డిఫరెంట్‌గా వుంటుంది. ఇప్పటివరకూ అలాంటి పాత్ర చేయలేదు. "కురల్" చాలా హానెస్ట్ క్యారెక్టర్. ఆమె తన భావోద్వేగాల పట్ల నిబద్ధతగా ఉంటుంది, చుట్టూ ఉన్న వారందరితో స్నేహంగా వుంటుంది. ఆమె చాలా సూటిగా మాట్లాడుతుంది. ఆ పాత్ర చేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్. ఈ సినిమాలో కొన్ని ఎమోషనల్ సీన్స్ నాకు సవాలుగా అనిపించాయి. ఆ సీన్స్ కోసం నేను రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. షూట్ సమయంలో వాటి గురించి ఆందోళన లేకుండా సీన్ మీద ఫోకస్ చేశా. నేను ఎప్పుడూ షూట్‌కు ముందు బాగా ప్రిపేర్ అయి ఉండాలని చూసుకుంటాను. అందుకే ఇది నాకు ఒకేసారి సవాలుగా, ఉత్సాహంగా అనిపించింది. ప్రదీప్ రంగనాథ్‌తో నటించడం మంచి ఎక్స్ పీరియన్స్. ఆయన మల్టీ ట్యాలెంటెడ్. సెట్స్‌లో చాలా హెల్ప్ ఫుల్‌గా వుంటారు. శరత్ కుమార్ లాంటి సినియర్ యాక్టర్స్‌తో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను.



# 'మేఘన' పోస్టర్, టీజర్ లాంచ్



యూత్‌ను ఎట్రాక్ట్ చేసే కథనంలో యూనిక్ క్రైమ్, సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ తెలుగు తెరపైకి రాబోతోంది. 'చిత్రం' శ్రీను ,సుష్మ , రామ్ బందారు హీరోహీరోయిన్లుగా సుధాకర రెడ్డి వర్ర దర్శకత్వం వహించిన చిత్రం 'మేఘన' శ్రీ శివ సాయి ఫిలిమ్స్ బ్యానర్‌పై నంది వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ చిత్ర పోస్టర్, టీజర్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాం బర్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా హీరో 'చిత్రం' శ్రీనివాస్ మాట్లాడుతూ "మంచి కంటెం ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా విజయం సాధి స్తుందని, నా ఖాతాలో మరో హిట్ పడుతుందని నమ్మకం ఉంది, నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు" అన్నారు. దర్శకుడు సుధాకర రెడ్డి వర్ర మాట్లాడుతూ "చిన్న ప్రొడక్షన్ అయినా పెద్ద కలలతో ఈ సినిమా చేశాం. ఎన్నో ఇబ్బందులు ఎదురైనా, కేవలం రెండేళ్లలోనే చిత్రాన్ని పూర్తి చేయగలిగాం. కథలో మానవ సంబంధాలు, భావోద్వేగాలు ప్రధానంగా ఉంటాయి. ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాం" అన్నారు. నిర్మాత నంది వెంకట్ రెడ్డి మాట్లాడుతూ "సమాజానికి మంచి సందేశం ఇచ్చేలా, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి నచ్చేలా సినిమా తీర్చిదిద్దాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా కథ సాగుతుంది.

# గాయని సునీత ఉపద్రష్ట చేతుల మీదుగా అతిన రీగల్ వీవ్స్ స్టోర్



జూబ్లీహిల్స్ రోడ్ నెం.66 లో అతిన రీగల్ వీవ్స్ స్టోర్ కొత్త షోరూంను ప్రారంభించింది. ఈ స్టోర్ ను గాయని సునీత ఉపద్రష్ట గారు మాట్లాడుతూ ఈ రోజు అతిన స్టోర్ నేను ప్రారంభించటం చాలా ఆనందంగా ఉంది. ఈ స్టోర్ సిల్క్ మార్క్ సర్టిఫికెట్ రావటం నిజంగా గొప్ప విషయం. ఇక్కడ నిజంగా ఇంత మంచి కలెక్షన్స్ చూస్తుంటే ప్రతి శారీ కొనాలి అనిపిస్తుంది. చాలా క్వాలిటీ తో ఉన్నాయి. యూనిక్ కలెక్షన్స్, ఉన్నాయి, బనారసీ మరియు భాందీని కలిపి చేయటం కొత్తగా ఉంది థ్రెడ్ వర్క్ తో చేయటం ఇంకా బాగుంది .. కాంబినేషన్స్ శారీ ఇక్కడ లభించటం గొప్ప విషయం. అతీన రీగల్ వీవ్స్ నిర్వాహకులు ఈ సందర్భంగా అనిత, లహరికా, మనశ్వని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ప్యూర్ పట్టు చీరలు అందించాలనే లక్ష్యంతో ప్రతి ఇంట్లో మా చీరలు ఉండాలి. అన్ని రకాల కలెక్షన్స్ ఎప్పటికప్పుడు మేము కొత్త డిజైన్స్ చేయించటం. ప్రత్యేకంగా మా స్టోర్ లో బ్రైడల్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఒక యూనిక్ స్టోర్ ని ఏర్పాటు చేశాం.స్టోర్ ఓపెనింగ్ సందర్భంగా కస్టమర్ల కోసం ప్రత్యేకమైన ఆఫర్లను అందిస్తున్నామని తెలిపారు. కస్టమర్లు అందరూ ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# యూత్, ఫ్యామిలీస్ అందరికీ కనెక్ట్ అయ్యే 'తెలుసు కదా'


స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి, ఎస్ థమన్, నీరజా కోన, టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 'తెలుసు కదా' రొమాంటిక్ & ఇంటెన్స్' ట్రైలర్ లాంచ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ మోస్ట్ ఎవైటెడ్ కమింగ్-ఆఫ్-ఏజ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా' టీజర్, రెండు పాటలతో సంచలనాన్ని సృష్టించింది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోనైస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. మేకర్స్ ఈ



సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్‌లో సిద్ధు "పవర్, కంట్రోల్ తన చేతిలోనే ఉండాలి" అని నమ్మే వ్యక్తిగా కనిపించారు. ఇద్దరు అమ్మాయిలతో రిలేషన్షిప్ చిక్కుకుపోయిన అతని జీవితం, ఆ తర్వాత ఎమోషనల్ రైడ్ ని అందిస్తోంది. ఈ కథ కేవలం లవ్ ట్రయాంగిల్ మాత్రమే కాదు..ఇది మేల్ ఇగో, మోడరన్ ఎమోషన్ పై ఎమోషనల్ అడ్వంచర్ గా వుంది. రచన, దర్శకత్వం రెండింటిలోనూ నీరజ కోన ఆకట్టుకున్నారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఆడియన్స్ ఎక్సైట్మెంట్, రెస్పాన్స్ కి థాంక్యూ. మీ అందరికీ ట్రైలర్ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్ తో ఒక్కసారిగా ఆడియన్స్ కి బ్యాంగ్ లాంటిది ఇవ్వాలని ముందే డిసైడ్ అయ్యాం. ట్రైలర్లో ఏం చూసారో సినిమాలో కూడా అదే క్యారెక్టర్, టోన్ కనిపిస్తుంది. టిల్లు లాంటి క్యారెక్టర్ నుంచి బయటికి రావాలంటే ఇలాంటి సినిమాలు చేయాలి. టిల్లు ఇన్నోసెంట్. బట్ తెలుసు కదా అలా కాదు. ఇంటెలిజెంట్ క్యారెక్టర్. వరుణ్ క్యారెక్టర్ చాలా ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. హీరోయిన్ రాశి ఖన్నా మాట్లాడుతూ.. మీ అందరి రెస్పాన్స్ చాలా హ్యాపీనెస్ ఇచ్చింది. ఇది ఒక రాడికల్ సినిమా అవుతుంది.

# "అరి" పై అనవసర దుష్ప్రచారం

"అరి" సినిమాలో ఏముందో తెలుసుకోకుండా ఈ చిత్రంపై దుష్ప్రచారం చేస్తూ, పోస్టర్స్ చించేస్తున్న వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు ఆర్ఎస్ఎస్ సేన నాయకులు. నేటి సమాజానికి, యువతకు ఈ సినిమా చాలా అవసరం అని, తప్పుదారిలో వెళ్తున్న సమాజానికి మంచిని చెప్పే ప్రయత్నం "అరి" సినిమాతో దర్శకుడు జయశంకర్ చేశారని ఆర్ఎస్ ఎస్ సేన నాయకులు అన్నారు. హైదరాబాద్ సప్తగిరి థియేటర్ వద్ద సినిమా చూసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ఓ పార్టీ నేతలు "అరి" సినిమా పోస్టర్స్ చింపుతూ, ఈ చిత్ర విజయాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా రని, అలాంటి వారు సినిమా చూసి మాట్లాడాలని ఆర్ఎస్ఎస్ సేన నేతలు అన్నారు. దుష్ప్రచారం చేస్తున్న వారు "అరి" చిత్ర బృందానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. "అరి" సినిమాను ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్ వీ రెడ్డి ) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి, శేషరెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు, లింగ గుణపనేని కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించారు. జయశంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 10న థియేటర్స్ లోకి వచ్చి, ప్రేక్షకాదరణ పొందుతోంది.



# నెట్‌ఫ్లిక్స్ అనౌన్స్‌మెంట్

2024లో విజయ్ సేతుపతి మహారాజా నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వ్యూస్ సాధించిన భారతీయ చిత్రంగా నిలిచింది. దుల్కర్ సల్మాన్ లక్కీ బాస్కర్ 14 వారాల పాటు ఇండియన్ టాప్ 10లో కొనసాగింది. పుష్ప 2, అమరన్, లియో, దేవర వంటి దక్షిణాది సినిమాలు గ్లోబల్ టాప్ 10 నాన్-ఇంగ్లీష్ లిస్ట్‌లో చోటు దక్కించుకోవడంతో, ఈ ప్రాంతం నుండి వచ్చే ఒరిజినల్ కథలకు ఉన్న డిమాండ్ మరింత పెరిగింది. TEST, The Game: You Never Play Alone విజయాల తర్వాత, నెట్‌ఫ్లిక్స్ ఇప్పుడు ఆరు కొత్త తమిళ, తెలుగు ఒరిజినల్ సినిమాలు, సిరీస్‌లతో కొత్త మైలు రాయిని చేరుతోంది.

నెట్‌ఫ్లిక్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మోనికా శెర్గిల్ మాట్లాడుతూ.."దక్షిణ భారత భాషలలోని కథలను ప్రోత్సహించడానికి మేము చాలా ఉత్సాహంగా ఉన్నాము. మా మొదటి ఒరిజినల్స్ నుండి ఈరోజు వరకూ, ఈ ప్రాంత కథల సమృద్ధి మా ఎదుగుదలకు బలమైంది. ఇప్పుడు, తమిళ, తెలుగు చిత్రసీమల నుండి వస్తున్న కొత్త క్రియేటర్స్‌తో కలిసి థ్రిల్లర్లు, కామెడీలు, ఎమోషనల్ డ్రామాలు, క్రాస్-కల్చరల్ రొమాన్స్‌లతో కొత్త ఫేజ్‌ను ప్రారంభిస్తున్నాము.

స్టీఫెన్(తమిళం) దర్శకుడు మిథున్ తెరకెక్కించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో గోమతి శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తు న్నారు. ఒక సైకియాట్రిస్ట్, తన ముందుకు వచ్చిన ఒక నేరస్థుడిని పరీక్షిస్తుంటుంది. అయితే ఆ కేసు వెనుక ఉన్న రహస్యం ఆమెనే మాయజాలంలోకి లాక్కుంటుంది.

సూపర్ సుబ్బు (తెలుగు) దర్శకుడు మల్లిక్ రామ్ దర్శకత్వంలో సందీప్ కిషన్ నటించిన ఈ కామెడీ సిరీస్ లాఫ్ రైడ్ గా వుతుంది. సెక్స్ ఎడ్యుకేషన్ నేర్పమని ఒక గ్రామానికి పంపిన వ్యక్తి, ఆ విషయంలో పూర్తిగా అనర్హుడే అయినా ఎలా హిలేరియస్ పరిస్థితుల్లో పడతాడో చూపిస్తుంది.

#Love (తమిళం) దర్శకుడు బాలాజీ మోహన్ రూపొందించిన ఈ మోడరన్ రొమాంటిక్ సిరీస్‌లో అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించారు. కెమిస్ట్రీ VS కంపాటిబిలిటీ అనే చర్చను సరదాగా, హృదయాన్ని హత్తుకునేలా చూపించే ఈ సిరీస్ ప్రేమలోని మాధుర్యాన్ని, గందరగోళాన్ని ఒకేసారి పరిచయం చేస్తుంది.

మేడ్ ఇన్ కొరియా (తమిళం) దర్శకుడు రా కార్తిక్ తీసిన ఈ క్రాస్ కల్చరల్ కథలో ప్రియాంక మోహన్, Squid Game ఫేమ్ పార్క్ హై-జిన్ ప్రధాన పాత్రల్లో నటించారు. కొరియా వెళ్లాలని కలగన్న యువతీ, కొత్త స్నేహాలు, జీవిత పాఠాల ద్వారా ఆమె తనను తాను తెలుసుకుంటుంది

తక్షకుడు (తెలుగు) దర్శకుడు వినోద్ అనంతోజు తెరకెక్కించిన ఈ ఫోక్‌లోర్ థ్రిల్లర్‌లో ఆనంద్ దేవర కొండ ఒక అంధుడి పాత్రలో కనిపిస్తారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·